


రేపు నగరానికి సీఎం

- రాడిసన్ బ్లూ హోటల్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ మీడియేషన్ సదస్సుకు హాజరు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల ఐదో తేదీన నగరానికి రానున్నారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ మీడియేషన్ సదస్సుకు ఆయన హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 8.50 గంటలకు రుషికొండ వద్ద గల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి తొమ్మిది గంటలకు రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళతారు. ఉదయం పది నుంచి 11.30 గంటల వరకూ సదస్సులో పాల్గొంటారు. అనంతరం 11.30 గంటలకు హోటల్ నుంచి తిరిగి రుషికొండ హెలిప్యాడ్‌కు చేరుకుని 11.40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి ఉండవల్లి వెళతారని అధికార వర్గాలు తెలిపాయి. ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్, కామన్వెల్త్ లాయర్స్ అసోసియేషన్ ఈ సదస్సు నిర్వహిస్తున్నాయి. సదస్సుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ పీఎస్ నరసింహం, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీఎస్ ఠాకూర్, ఇతర న్యాయమూర్తులు హాజరవుతారు.

ఆర్ఈసీఎస్ ఉద్యోగులకు ఝలక్

- తీర్పు వచ్చేంత వరకూ పాత జీతాలే ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశం
- పీఆర్‌సీకి ముందు జీతాలే ఇచ్చిన ఈపీడీసీఎల్

- 6లో

స్మార్ట్ బస్టాపుల్లో అంధకారం!

వెలగని దీపాలు
జాతీయ రహదారి పొడవునా ఇదే పరిస్థితి

- ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు
- చీకట్లో రోడ్డుపైనే నిల్చోవాల్సిన పరిస్థితి
- పట్టించుకోని అధికారులు
- ఆ బాధ్యత తమది కాదంటున్న జీవీఎంసీ ఎలక్ట్రికల్ విభాగం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో అట్టహాసంగా నిర్మించిన స్మార్ట్ బస్టాప్‌లు నిర్వహణాలోపంతో సతమతమవుతున్నాయి. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన బస్టాప్‌లు పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రయాణికులకు సరైన సేవలు అందించ లేకపోతున్నాయి. ఇప్పటికే కొన్ని బస్టాపుల నేమ్‌బోర్డులు మాయమైపోగా, ఇప్పుడు రాత్రివేళ బస్టాపుల్లో లైట్లు వెలగకపోవడంతో అంధకారం అలముకుంటోంది. దీంతో ప్రయాణికులు రాత్రి వేళ ఆయా బస్టాప్‌ల్లో వేచి ఉండాలంటే భయపడుతున్నారు.





గురుద్వార వద్ద బస్టాప్‌లో లైట్లు వెలగకపోవడంతో అలముకున్న చీకట్లు (ఇన్‌సెట్‌లో) అక్కయ్యపాలెం నార్త్ బస్టాప్‌లో ఇలా...



పోర్టు ఆసుపత్రి వద్ద బస్టాప్‌లో చీకట్లు

జీ-20 సదస్సు సందర్భంగా 2023లో స్మార్ట్ బస్టాప్‌లకు జీవీఎంసీ శ్రీకారం చుట్టింది. మొట్టమొదట ఏయూ అవుట్‌గేట్ వద్ద రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన స్మార్ట్ బస్టాపునకు ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో నగర పరిధిలో 20 చోట్ల అదేతరహాలో స్మార్ట్ బస్టాపులను ఏర్పాటుచేసింది. ఇందుకోసం ఒక్కోదానికి రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు జీవీఎంసీ వెచ్చించింది. బస్టాపుల్లో అత్యాధునికమైన ఎల్ఈడీ లైట్లు, రాత్రివేళ ఆకర్షణీయంగా కనిపించేలా నేమ్ బోర్డులు, బస్టాప్‌లో కూర్చునేందుకు

... మిగతా 6వ పేజీలో

ఉత్తమ గురువులు

జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి అవార్డులు

- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయవాడలో ప్రదానం

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లా నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. అక్కిరెడ్డిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూలు అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా పనిచేస్తున్న జి.కుమారస్వామి, యారాడ జడ్పీ ఉన్నత పాఠశాలో స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ)గా పనిచేస్తున్న జీఎం సుజాత, గోపాలపట్నం లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీ ఎం. మోహనరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల ఐదో తేదీన విజయవాడలో జరగనున్న కార్యక్రమంలో ముగ్గురికీ అవార్డులు అందజేస్తారు. అవార్డుకు ఎంపికైన టీచర్లకు డీఈవో ఎన్. ప్రేమ్‌కుమార్ అభినందనలు తెలిపారు.

విద్యాభివృద్ధికి విశేష కృషి



మెట్ట మోహనరావు

గోపాలపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):
గోపాలపట్నం సమీపంలోని లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న మెట్ట మోహనరావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. 1995లో బుచ్చెయ్యపేట మండలం పంగిడి పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా మోహనరావు ప్రస్థానం ప్రారంభమైంది. పంగిడి పాఠశాలలో పనిచేసిన ఎనిమిదేళ్లలో పాఠశాల అభివృద్ధికి కృషిచేశారు. గ్రామస్థుల సాయంతో పాఠశాలకు రహదారి నిర్మించారు. లక్ష్మీనగర్‌కు 2017లో వచ్చిన తరువాత దాతల నుంచి సుమారు రూ.2 లక్షలను సమీకరించి డైనింగ్‌హాల్ నిర్మించారు. పాఠశాలకు సౌండ్ సిస్టమ్, విద్యార్థులకు బెంచీలు, స్టేషనరీ సమకూర్చారు. కృత్యాధార బోధనతో విద్యార్థులకు సులువుగా పాఠాలు అర్థమయ్యేలా చెప్పడంలో మోహనరావు కృతకృత్యులయ్యారు. చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు, ఏటా పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య పెరగడానికి కృషిచేశారు.

అవార్డు బాధ్యత పెంచింది



జి.కుమార స్వామి

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):
అక్కిరెడ్డిపాలెం ఉన్నత పాఠశాల ఇంగ్లీషు ఉపాధ్యాయుడు గుడిమెట్ల కుమారస్వామి రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. 1990లో సర్వీసులో చేరిన కుమారస్వామి విద్యార్థులకు వినూత్న రీతిలో పాఠాలు బోధిస్తున్నారు. ఆంగ్ల విద్యా బోధనను సరళతరం చేసి, వారిని ఆకట్టుకునేలా ప్రత్యేక పద్ధతులు రూపొందించుకున్నారు. 2019లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు దక్కించుకున్నారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచింది.

వినూత్న రీతిలో బోధన



జీఎం.సుజాత

యారాడ ఉన్నత పాఠశాల బయాలజీ టీచర్ జీఎం సుజాత రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ఆమె 27 ఏళ్ల పాటు మాడుగుల ఎయిడెడ్ పాఠశాలలో పనిచేశారు. ఏడాది కిందట యారాడకు బదిలీపై వచ్చారు. 2023లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకున్నారు. వినూత్న ఆలోచనలు, ప్రాజెక్టులతో పాఠాలు బోధిస్తుంటారు. విద్యార్థులను ఆకట్టుకునేలా బోధించడం ద్వారా వారి మనసులోకి పాఠ్యాంశాలను చొప్పుకునేలా చేయవచ్చన్నారు. రాష్ట్ర స్థాయి అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.



నీట మునిగిన గోపాలరెడ్డినగర్

గాజువాకలో కుండపోత

గాజువాక, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):
గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం సాయంత్రం గంటన్నరపాటు కుండపోతగా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు... ప్రధానంగా 76వ వార్డు పరిధిలోని గోపాలరెడ్డి నగర్, డెయిరీ కాలనీ, రామచంద్రనగర్, ఎస్టీ కాలనీ జలమయమయ్యాయి. గెడ్డలు నిండిపోయి నీరు రోడ్లపైకి వచ్చింది. వర్షానికి గాజువాకలో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తింది. పాతగాజువాక నుంచి ఓవైపు శ్రీనగర్, మరోవైపు బీహెచ్‌పీవీ, కొత్త గాజువాక జంక్షన్‌ల వరకూ వాహనాలు నిలిచిపోయాయి. వర్షం వల్ల బస్సుల రాకపోకలు కూడా నిలిచిపోవడంతో ప్రయాణికులు గంటల కొద్దీ బస్టాపులో నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రేషన్ బియ్యం పంపిణీకి బ్రేక్




బియ్యంకోసం వేలిముద్రవేస్తున్న కార్డుదారులు

- రెండు రోజులుగా సర్వర్ మొరాయింపు
- డిపోల వద్ద కార్డుదారుల నిరీక్షణ

- 6లో

అప్పన్న సన్నిధిలో గోవా గవర్నర్ అశోక్



స్వామివారి ఆలయంలో గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు దంపతులు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

- 8లో

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రలు ఆపాలి



ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

- 6లో

చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు

రాష్ట్రీయ బాలస్వాస్థ్య ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహించనున్న ప్రభుత్వం

- ఇప్పటివరకూ తిరుపతిలో మాత్రమే ఈ తరహా ఆపరేషన్లు నిర్వహణ
- తాజాగా ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల కోసం విశాఖలోని మెడికవర్ ఆస్పత్రి ఎంపిక
- వెయ్యి మందిలో ఎనిమిది మంది శిశువులకు గుండె సమస్యలు
- జన్యుపరమైన, పోషకాహారలోపం కారణాలు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):
గుండె జబ్బులతో పుట్టిన చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్సలను నిర్వహించేందుకు ప్రభుత్వం ముందుకువచ్చింది. రాష్ట్రీయ బాలస్వాస్థ్య ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రస్తుతం తిరుపతిలోని పద్మావతి ఆస్పత్రిలో ఈ తరహా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. ఉత్తరాంధ్రలో కూడా ఇటువంటి శస్త్రచికిత్సలను నిర్వహించాలని నిర్ణయించి, నగర పరిధిలోని మెడికవర్ ఆస్పత్రిని ఎంపిక చేసింది. ఉత్తరాంధ్రతోపాటు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ (డీఈఐసీ) సెంటర్ల ద్వారా గుర్తించిన చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించనున్నారు. ఇందుకోసం రూపాయి కూడా బాధిత చిన్నారుల కుటుంబ సభ్యులు చెల్లించాల్సిన అవసరం లేదు. ఎన్టీఆర్



వైద్యసేవ కార్డు ఉంటే ఆ స్కీమ్‌లో, ఒకవేళ కార్డు లేకపోయినా ప్రత్యేక అనుమతి ద్వారా పిల్లలకు ఈ శస్త్రచికిత్సలు నిర్వహిస్తారు. నెల రోజులు కిందటే ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయాన్ని తీసుకున్నట్టు ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా వేయి మందిలో ఎనిమిది మంది నవజాత శిశువులు గుండె జబ్బులతో పుడుతున్నట్టు వైద్యులు పేర్కొంటున్నారు. వారిలో

... మిగతా 6వ పేజీలో

ఉక్కు సీఎండీని కలిసిన కలెక్టర్

- నిర్వాసిత కార్మికుల తొలగింపు సహా మూడు అంశాలపై చర్చ



విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):
స్టీల్ ప్లాంటు సమస్యలపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దృష్టిసారించారు. బుధవారం ఉక్కు సీఎండీ ఏకే సక్సేనాను కలిసి మూడు అంశాలపై చర్చించారు. ఇటీవల అక్రమంగా తొలగించిన కాంట్రాక్టు కార్మికుల్లో నిర్వాసితులు (ఆర్.కార్డుదారులు) ఉన్నారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. దానికి సీఎండీ సూత్రప్రాయంగా అంగీకరించినట్టు తెలిసింది. మే నెలలో వారంతా సమ్మెలో పాల్గొన్నారని, కాంట్రాక్టర్లు విధుల్లోకి రమ్మని పిలిచినా రాలేదని, అందువల్ల వారిని తిరిగి తీసుకోవాలంటే ఆలోచించాల్సి వస్తోందని చెప్పినట్టు సమాచారం. అలాగే స్టీల్ ప్లాంటు ఆర్థిక సాయంతో

... మిగతా 6వ పేజీలో

10న జడ్పీ స్టాండింగ్ కమిటీల సమావేశాలు

విశాఖపట్నం, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి):
జిల్లా ప్రజాపరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల పదో తేదీన జరగనున్నది. నాలుగు స్టాండింగ్ కమిటీలకు జడ్పీ చైర్పర్సన్, మిగిలిన మూడు స్టాండింగ్ కమిటీలకు ఇతర అనకాపల్లి, కె.కోటపాడు, నాతవరం జడ్పీటీసీ సభ్యులు అధ్యక్షత వహిస్తారు. సమావేశాలకు సంబంధించి సభ్యులు, అధికారులు హాజరుకావాలని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు.





ఆలయంలో పండితుల పఠనం

సంప్రదాయబద్ధంగా పవిత్రాధివాసం

సింహాచలం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై జరుగుతున్న అప్పన్న స్వామి పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులు, యజ్ఞమూర్తిగా సుదర్శన పెరుమాళ్‌ను ఆలయ కల్యాణ మండపంలో శోభాయమానంగా అలంకరించిన ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. శాస్త్ర విధానాన్ని అనుసరించి ఉపచారాలు సమర్పించారు. ఉదయం 7.30 గంటలకు స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో పండితులు, అధ్యాపకులు స్వామివారి సన్నిధిలో చతుర్వేదాలు, ఇతిహాసాలు, విష్ణుపురాణం, క్షేత్ర మహాత్మ్యం వంటి పురాణాలను వినిపించి పారాయణలకు శ్రీకారం చుట్టారు. అనంతరం మండల రచన చేసి కలశారాధన, ద్వాదశ ద్వార పాలకార్చనలు, మండపారాధన, బింబారాధన జరిపి ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో ప్రత్యేక హోమాలు చేశారు. ఉదయం బాలభోగం, మధ్యాహ్నం రాజభోగ నివేదనలు చేసి, రోజంతా పండితులు పారాయణలు చేశారు. పవిత్రాలను ప్రత్యేక ఆసనంపై ఉంచి పూజలు చేసి అధివాసం చేశారు. సాయంత్రం గ్రామ తిరువీధి నిర్వహించారు.

అప్పన్నను దర్శించుకున్న సినీ నటులు



స్వామివారి సన్నిధిలో నటులు

సింహాచలం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామిని సినీ నటులు గీతాసింగ్, చిట్టిబాబు, సుధాకర్ బుధవారం దర్శించుకున్నారు.వారికి ఆలయ సిబ్బంది ఆత్మీయ స్వాగతం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న నటుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

వినాయకుడికి ఆగమ విద్యార్థుల పూజలు

సింహాచలం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :సింహాచలం దేవస్థానం ఆధీనంలో నడుస్తున్న ఆగమ పాఠశాలలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులు బుధవారం లక్ష దూర్వార్చన, గణపతి హోమం నిర్వహించారు. ప్రభాతారాధనలు ముగిసిన తరువాత స్వామివారికి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం గణపతి సహస్రనామాలతో పది ఆవృతలు, దూర్వాలతో (గరిక) పూజలు చేశారు. అలాగే పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జీటీ శ్రీకాంతాచార్యులు, శైవాగమ పండితుడు సుబ్రహ్మణ్యశర్మ పర్యవేక్షణలో గణపతి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సాధారణ పరిపాలనా విభాగం సహాయ ఈఓ రమణమూర్తి, పర్యవేక్షణాధికారి మూర్తి, పాల్గొన్నారు.

సంసిద్ధతా కార్యక్రమం పరిశీలన

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను భీమిలి డైట్ కళాశాల అధ్యాపకులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యా శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన సంసిద్ధతా కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రధాన సబ్జెక్టులకు సంబంధించి 40 రోజుల పాటు ప్రత్యేక బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యా శాఖ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్‌లను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనం, విద్యా శక్తి పథకాల అమలును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు ఎం. వెంకటరమణ, కె.సంతోషి, శోభారాణి, వసుంధర, పాఠశాల హెచ్‌ఎం దంతంశెట్టి సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు

... 5వ పేజీ తరువాయి

నలుగురికి శస్త్ర చికిత్సలు నిర్వహించాల్సిన అవసరం ఏర్పడుతోంది. గతంతో పోలిస్తే ఈ తరహా బాధిత చిన్నారులు పెరుగుతున్నట్టు చెబుతున్నారు. సాధారణ ప్రసవాల్లో వేయి మందిలో 8 మందికి గుండె జబ్బు ఉంటే, ఐవీఎఫ్, ఇతర పద్ధతుల్లో పుట్టే చిన్నారుల్లో 15 నుంచి 20 మందికి గుండె సమస్యలు ఉంటున్నట్టు పేర్కొంటున్నారు. గుండె శస్త్రచికిత్సల నిర్వహణకు కార్పొరేటు ఆస్పత్రుల్లో అయితే కనీసం రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఖర్చవుతుంది. అంత ఖర్చు చేసే స్థోమత సాధారణ, మధ్య తరగతి కుటుంబాలకు ఉండదు. అటువంటి వారికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహణకు నిర్ణయించింది.

ఇవీ లక్షణాలు..

శిశువుల్లో గుండె సంబంధిత సమస్యలను ప్రసవానికి ముందే గుర్తించేందుకు అవకాశం ఉంది. యాంటెనాటల్ స్కానింగ్ చేయడం ద్వారా ముందే సమస్యను గుర్తించి అందుకు అనుగుణమైన వైద్యం అందించడం ద్వారా కోలుకునేలా చేయవచ్చు. అయితే, వంద మంది గర్భిణుల్లో పది మంది కూడా ఈ తరహా స్కానింగ్స్ చేయించుకోవడం లేదని, దీనివల్లే గుండె జబ్బులతో పుట్టే చిన్నారుల సంఖ్య పెరుగుతోందని వైద్యులు పేర్కొంటున్నారు. ఆయాసం, తీవ్రమైన దగ్గు, గుండె వేగంగా కొట్టుకోవడం, ఎప్పటికప్పుడు అనారోగ్యానికి గురవుతుండడం, వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యుల వద్దకు తీసుకువెళ్లాలి.

ఎందుకు సమస్య

జన్యుపరమైన అంశాలు, మేనరిక వివాహాలు, పోషకాహారలోపం, 35 ఏళ్లు దాటిన తరువాత వివాహాలు, ఐవీఎఫ్ వంటి పద్ధతుల్లో పిల్లలను కనడం వంటివి చిన్నారుల్లో గుండె జబ్బులకు కారణమవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.

ప్రాథమిక దశలో గుర్తించేందుకు స్క్రీనింగ్

చిన్నారుల్లో ఉన్న అనారోగ్య సమస్యలను గుర్తించేందుకు ఏడాదికి రెండుసార్లు హెల్త్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆశ, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ వెళ్లి స్క్రీనింగ్ చేస్తారు. ఎత్తు, బరువు, హెచ్‌బీతోపాటు ఇతర పరీక్షలు నిర్వహిస్తారు. సమస్య ఉన్నట్టు గుర్తించిన వారిని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి మరిన్ని పరీక్షలు చేస్తారు. అక్కడ ఏదైనా సమస్య ఉంటే జిల్లాస్థాయిలో ఉన్న డీఈఐసీకి రిఫర్ చేస్తారు. అక్కడ మరిన్ని పరీక్షలు నిర్వహించి తీవ్రమైన సమస్య ఉన్న వారికి శస్త్ర చికిత్సలు చేయిస్తాం. ఇప్పటివరకు గుండె జబ్బులు ఉన్న చిన్నారులను తిరుపతి పంపించి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నాం. ఇకపై ఇక్కడే నిర్వహించేలా ప్రభుత్వం ఒక ప్రైవేటు ఆస్పత్రిని ఎంపిక చేసింది. కొద్దిరోజుల్లో ఆస్పత్రితో కలిసి ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తాం.

- డాక్టర్ బి.హారిక, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్



తగరపువలస మెయిన్ రోడ్డులో అడ్డదిడ్డంగా ఆవులు



సీతకొండ మలుపులో రహదారిపై సంచరిస్తున్న గేదెలు

రహదారులపై పశువుల సంచారంతో ఇక్కట్లు

విశాలాక్షినగర్ / తగరపువలస, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని సీతకొండ మలుపు నుంచి అప్పుఘర్ వరకు ఉన్న బీచ్ రోడ్డులో పశువుల సంచారంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరం నుంచి వచ్చే వాహనదారులు ఎక్కువగా బీచ్ రోడ్డులో రాకపోకలు చేస్తుంటారు. పశువులు నిత్యం రోడ్లపై సంచరిస్తుండడంతో వారంతా అవస్థలు పడుతున్నారు. కొన్నిసార్లు ప్రమాదాలకు గురవుతున్నారు.బీచ్‌రోడ్డులో వీఐపీల పర్యటన ఉన్నప్పుడు తప్ప మిగతా సమయాల్లో జీవీఎంసీ సిబ్బంది ఈ సమస్య గురించి పట్టించుకోవడం లేదు. తగరపువలస మెయిన్ రోడ్డులోనూ పశువులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి.బస్టాండ్ నుంచి సంత వరకు పశువులు రోడ్డుకు అడ్డదిడ్డంగా ఉంటున్నాయి.వీటి వల్ల ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తలెత్తుతున్నాయి. జోనల్ కమిషనర్ పశువుల పెంపకందారులకు పలుమార్లు హెచ్చరికలు జారీ చేస్తున్నా..ఎవరూ పట్టించుకోవడం లేదు.

రెవెన్యూ సమస్యలపై వాడివేడి చర్చ

▸▸ తహశీల్దార్ శ్రీనుబాబు ▸▸ ఆనందపురం మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనుబాబు

ఆనందపురం,సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ శ్రీనుబాబు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మజ్జి శారదాప్రియాంక ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు ఉన్నట్లయితే నేరుగా తనను కలిస్తే పరిష్కరిస్తామని చెప్పారు. గంభీరం పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు బొట్టా ధనలక్ష్మి రామకృష్ణ జోక్యం చేసుకుని.. సర్వే నెంబరు 173లోని గెడ్డ వాగును కొంత మంది ఆక్రమించి, నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలకు పంచాయతీ ఇంటి పన్ను, విద్యుత్ మీటర్లు కూడా ఇచ్చిందని, అయినా చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. స్థలాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు. బోని సర్పంచ్ బోని కొండమ్మ మాట్లాడుతూ ఇనాం భూ సమస్యను పరిష్కరించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇనాం భూముల పరిష్కారానికి కృషి చేశారని, కూటమి ప్రభుత్వం వచ్చాక పట్టించుకోలేదన్నారు. ఇనాం భూముల రైతులకు హక్కులు కల్పించాలని కోరారు. ఎల్‌వీ పాలెం సర్పంచ్ లొడగల రాజేశ్వరి రమణ మాట్లాడుతూ ఆనందపురం నుంచి ఎల్‌వీపాలెం పంచాయతీ విభజన జరిగిన తరువాత సరిహద్దు నిర్ణయించకపోవడంతో ఇంటి పన్ను, ఇతరత్రా ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ, వైద్యం, తదితర శాఖల అధికారులు మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జానకి, జడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, ఆనందపురం, వేములవలస సహకార సంఘాల అధ్యక్షులు పాండ్రంకి శ్రీను, రౌతు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పందలపాకలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు

ఆనందపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పందలపాక గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ బషీర్ మాట్లాడుతూ దేశంలో విద్యా అక్షరాస్యత 80 శాతం ఉండగా, ఆర్థిక అక్షరాస్యత 27 శాతమే ఉందని చెప్పారు. ఆర్థిక అక్షరాస్యత లోపం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, విద్యార్థి దశ నుంచి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరమని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖ రీజనల్ మేనేజర్ సింహాచలం, కెనరా బ్యాంక్ రీజనల్ హెడ్ ఎన్. మధుసూదనరెడ్డి, విశాఖపట్నం డీఆర్‌డీఏ పిడి లక్ష్మీపతి, ఏపీజీవీబీ రీజనల్ హెడ్ చిరంజీవి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, ఆనందపురం యూబీఐ మేనేజర్ తిరుపతిరావు, చందక గ్రామ సర్పంచ్ బంక శ్రీను. తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీవితబీమా పథకాల్లో ప్రతిఒక్కరూ చేరాలని ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టరు బషీర్ చెప్పారు. రేవిడిలో రెడ్డిపల్లి ఎస్‌బీఐ ఆధ్వర్యంలో జరిగిన జన సురక్ష యోజన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ డీజీఎం రాహుల్ శంక్రిత్య, ఆర్‌ఎం అభిషేక్ కుమార్, ఎఫ్ఐ మేనేజర్ రాఘవేంద్ర, రెడ్డిపల్లి ఎస్‌బీఐ మేనేజరు వెంకటేష్ డీసీసీబీ సీఈఓ సుకుమార్‌వర్మ పాల్గొన్నారు.

ఆర్ఈసీఎస్ ఉద్యోగులకు ఝలక్

తీర్పు వచ్చేంత వరకూ పాత జీతాలే ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సరఫరా సంఘం (ఆర్ఈసీఎస్) ఉద్యోగులకు హైకోర్టు ఝలక్ ఇచ్చింది. కేసు తేలేంత వరకూ పాత జీతాలే ఇవ్వాలని ఈపీడీసీఎల్‌ను ఆదేశించింది. దాంతో అధికారులు ఆగస్టు నెల జీతాల కింద పీఆర్‌సీకి ముందు మొత్తాలే విడుదల చేశారు.ఒక్కో ఉద్యోగికి సగటున రూ.20వేలు తగ్గిపోయింది. సొసైటీలో అడ్డగోలు వ్యవహారాలు జరుగుతున్నాయని 'ఆంధ్రజ్యోతి' ఎప్పటికప్పుడు కథనాలు ప్రచురిస్తూనే ఉంది. ఇటీవల శాశ్వత ఉద్యోగులు 72 మంది తమకు పే రివిజన్ కమిషన్ 2022 సిఫారసుల ప్రకారం జీతాలు ఇవ్వాలని ఈపీడీసీఎల్ అధికారులను కోరారు.దీనికి గతంలో సొసైటీ చేసిన పాత తీర్మానం కాపీని జత చేశారు. అంతా కుమ్మక్కు కావడంతో ఈ ఏడాది మే నెలలో వారికి ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు జీతాలు పెంచుతూ పీఆర్‌సీ ఇచ్చారు. అయితే వారిలో కొందరు అతి తక్కువ కాలంలో రెండేసి ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు తీసుకున్నారని, సస్పెన్షన్‌లో ఉన్నవారు కూడా పదోన్నతులు తీసుకున్నారని, అర్హతలు లేకుండా ప్రమోషన్ పొందారని సర్వీస్ రికార్డుల పరిశీలన ద్వారా ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు గుర్తించారు. అటు వంటి వారందరికీ జూలై నెలలో పాత జీతాలనే ఇచ్చారు. దీనిపై గుర్రుమన్న ఉద్యోగులు కొందరు హైకోర్టును ఆశ్రయించారు. తమకు ఇచ్చినవి వెనక్కి తీసుకున్నారని పిటిషన్ వేశారు. పూర్తి జీతాలు ఇప్పించాలని కోరారు. ఇదే సమయంలో పీఆర్‌సీ ప్రస్తావన కూడా వచ్చింది. సొసైటీలకు పీఆర్‌సీ ఎలా ఇస్తారంటూ వాదనలు జరిగాయి. ఈనేపథ్యంలో తీర్పు వచ్చేవరకు ఉద్యోగులకు పాత జీతాలనే ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది.దాంతో అధికారులు పీఆర్‌సీ ఇవ్వడానికి ముందు అంటే 2025 మే నెలకు ముందు ఏ జీతాలు ఇచ్చారో వాటినే సెప్టెంబరు 1, 2 తేదీలతో ఖాతాలకు జమ చేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రలు ఆపాలి

మహారాణిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఈవోఐ పేరుతో ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే కుట్రలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలిపివేయాలని కార్మిక, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో జగదాంబ జంక్షన్ నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ప్రజా సంఘాల జేఏసీ ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో 46 విభాగాల ప్రైవేటీకరణకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ, ఈనెల 9న బిడ్లు వేయాలని కోరుతూ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ప్లాంట్‌ను ముక్కలు చేసి ప్రైవేట్‌కు కట్టబెట్టే చర్యలతో కార్మికుల జీవనోపాధి, జాతి ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ప్లాంట్‌ను కాపాడాల్సిన ఎంపీ భరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మోదీ ప్రభుత్వానికి భజన చేయడం దారుణమన్నారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, సొంతగనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేసి, ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌ను కాపాడాలన్న చిత్తశుద్ధి కనబరచకపోతే కూటమి ప్రభుత్వానికి తగిన శాస్తి జరుగుతుందని హెచ్చరించారు.



కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయించిన ప్రజా సంఘాల జేఏసీ నేతలు



నోట్లతో వినాయకుడి కిరీటం

నోట్లతో వినాయకుడి కిరీటం అలంకరణ

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పాడ గ్రామంలో హైటెక్ డిఫెన్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గణేశ్ ప్రతిమ కిరీటాన్ని సుమారు వెయ్యి రూపాయల రూ. 10, రూ. 50 నోట్లతో అలంకరించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం మండపం సమీపంలో మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. 14 గ్రామాల భక్తులు హాజరై స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

గొట్టిపల్లిలో డిజిటల్ అసిస్టెంట్ లేక ఇక్కట్లు

ఆనందపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొట్టిపల్లి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేక వివిధ పనులపై కార్యాలయానికి వస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడ డిజిటల్ అసిస్టెంట్‌గాపనిచేసిన మధుసూదన్ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో బదిలీపై వచ్చిన శివ మనోహర్‌ను డిప్యూటేషన్‌పై విశాఖ డీపీఓ కార్యాలయానికి పంపించారు. దీంతో ఇక్కడి పోస్టు ఖాళీగా ఉంది. గొట్టిపల్లి సచివాలయం పరిధిలో వెంకటాపురం. చీమలమెట్టపాలెం, గొట్టిపల్లి కళ్లాలు ఉన్నాయి. డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వచ్చే నెల 7 నుంచి మూట్ కోర్టు పోటీలు

సాగర్‌నగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో వచ్చేనెల 7 నుంచి 10వ తేదీ వరకు న్యాయ విద్యార్థులకు మూట్ కోర్టు పోటీలు వర్చ్యువల్‌గా నిర్వహించనున్నట్టు డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ లక్ష్మణరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గీతం మూట్, అడ్వకసీ కమిటీ ఆధ్వర్యంలో వర్సిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి పేరుతో ఐదేళ్లుగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. న్యాయవాద వృత్తిలో పాటించాల్సిన మెళకువలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు న్యాయ స్థానంలో వాదోపవాదాలపై వృత్తి నైపుణ్యాన్ని పెంచడానికి ఈ పోటీలు దోహదపడతాయని తెలిపారు. పూర్తి వివరాలకు, రిజిస్ట్రేషన్ కోసం గీతం వెబ్‌సైట్‌ను సంప్రతించాలని ఆయన సూచించారు.

'అయ్యప్ప సేవా పీఠాల్లో రాజకీయ జోక్యం వద్దు'

తగరపువలస, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : శబరిమలై అయ్యప్పస్వామి దేవాలయాల కార్యకలాపాల నిర్వహణలో రాజకీయ జోక్యాన్ని వ్యతిరేకిస్తున్నామని అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ అధ్యక్ష, కార్యదర్శులు అయ్యప్పదాస్, గాడు తాతినాయుడు పేర్కొన్నారు. బుధవారం వారు ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. భక్తుల విశ్వాసాన్ని రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదని చెప్పారు. కేరళ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం భక్తులను ఆందోళనకు గురి చేస్తుందని, హిందూ ధార్మిక సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలతో చర్చించి ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం జరగనున్నట్టు జీవీఎంసీ కార్యదర్శి బీవీరమణ తెలిపారు. ఇందుకోసం 198 అంశాలతో అజెండా తయారుచేసి సభ్యులకు అందజేశామన్నారు. నీటి సరఫరా పైప్‌లైన్ల మరమ్మతులు, కొత్తవాల్వ్‌ల ఏర్పాటు, ఫెర్రిక్‌ఆలం, నీటిశుద్ధి రసాయనాల కొనుగోలు, ట్యాంకర్లను అద్దెప్రాతిపదికన తీసుకోవడం వంటి 50 అంశాలను పొందుపరిచారు. కొన్ని జోన్‌ల పరిధిలోని చెత్త ట్రాన్స్‌ఫర్‌స్టేషన్ల వద్ద తడి-పొడి చెత్త విభజనకు ర్యాగ్‌పిక్కలను నెలవారీ అద్దెప్రాతిపదికన ఏడాది కాలానికి విధుల్లోకి తీసుకోవడం, తాత్కాలిక పారిశుధ్య కార్మికులకు వేతనాల చెల్లింపు, డ్రెయిన్‌లు, కల్వర్టులు, భవనాలు, రోడ్ల నిర్మాణాలు, గెడ్డల్లో పూడిక తీతకు యంత్రాలను సమకూర్చడం, బీచ్‌రోడ్డులో పారిశుధ్య నిర్వహణకు నియమించిన తాత్కాలిక కార్మికులకు వేతనాల చెల్లింపు, పారిశుధ్య కార్మికులకు యాప్రాన్‌లు కొనుగోలు, జీవీఎంసీ వాణిజ్య సముదాయాల్లోని దుకాణాల వేలం, నిరాశ్రయుల కోసం జీవీఎంసీ నిర్వహిస్తున్న ఆశ్రయ కేంద్రాల నిర్వహణను ఎన్‌జీవోలకు అప్పగించడం వంటి అంశాలను అజెండాలో చేర్చారు.

విజయవాడ బ్లాస్టర్స్‌పై తుంగభద్ర దివాస్ గెలుపు

విశాఖపట్నం-స్పోర్ట్స్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర ఉమెన్ టీ20 లీగ్ టోర్నీలో భాగంగా బుధవారం ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో తుంగభద్ర దివాస్ రెండు పరుగుల తేడాతో విజయవాడ బ్లాస్టర్స్‌పై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ బ్లాస్టర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 146 పరుగులు చేసింది. మేఘన (32), శేతుసాయి అర్ధ సెంచరీ (64), రంగలక్ష్మి (28) రాణించారు. తుంగభద్ర బౌలర్ పూజితకు రెండు వికెట్లు దక్కాయి. వర్షం కారణంగా కొద్దిసేపు మ్యాచ్ నిలిచిపోవడంతో వీజేడీ మెథడ్ విధానం ప్రకారం తుంగభద్ర దివాస్‌కు 12.4 ఓవర్లలో 81 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. తుంగభద్ర దివాస్ 12.4 ఓవర్లలో 82 పరుగులు చేసి అనూహ్యంగా విజయం సాధించింది. కె.దీక్ష (27), హాసిని (39), పద్మజ (10 నాటౌట్) రాణించి జట్టుకు విజయాన్నందించారు.

రేషన్ బియ్యం పంపిణీకి బ్రేక్

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖ సర్వర్ పనిచేయకపోడంతో రెండు రోజులుగా కార్డుదారులకు బియ్యం పంపిణీ నిలిచిపోయింది. ఒకటో తేదీన బాగానే పనిచేసిన సర్వర్ మంగళవారం ఉదయం 11 గంటల తరువాత మొరాయించింది. బుధవారం రాత్రికి కూడా సమస్య పరిష్కారం కాలేదు. కార్డుదారులు రేషన్ డిపోల వద్ద గంట, రెండు గంటలు నిరీక్షించి వెనుతిరుగుతున్నారు. కార్డుదారులకు బియ్యం, పంచదార పంపిణీ చేసేందుకు ప్రతి డిపోకు తూకపు యంత్రాలు ఇచ్చారు. ఆ యంత్రాలను ఈపోస్ మిషన్‌కు అనుసంధానం చేశారు. తూకపు యంత్రానికి, సర్వర్‌కు మధ్య అనుసంధానం చేసే బ్లూటూత్ కనెక్షన్ పనిచేయకపోవడంతో బియ్యం పంపిణీ నిలిచిపోయింది. జిల్లాలోని 642 రేషన్ డిపోలకు రెండు కంపెనీలకు చెందిన తూకపు యంత్రాలు (బ్లూటూత్‌తో కూడినవి) ఇచ్చారు. అందులో 485 డిపోల్లో మిషన్లు పనిచేయకపోవడంతో డీలర్లు, కార్డుదారులు ఇబ్బందిపడ్డారు. మంగళవారం ఉదయం నుంచి సర్వర్ పనిచేయక బియ్యం, పంచదార పంపిణీ నిలిచిపోవడంతో కొన్నిచోట్ల డీలర్లతో గొడవకు దిగారు. ఈనెల ఒకటో తేదీ నుంచి మంగళవారం ఉదయం 11 గంటల వరకూ జిల్లాలో 5,21,382 కార్డుదారులకుగాను 1,61,987 మందికి (31 శాతం) బియ్యం పంపిణీ చేశామని జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల తరువాత సాంకేతిక సమస్యతో సర్వర్ జామ్ అయిందన్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలో సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

స్మార్ట్ బస్టాపుల్లో అంధకారం!

... 5వ పేజీ తరువాయి

గ్రానైట్ పలకలతో కూడిన అరుగు, స్టెయిన్‌లెస్ స్టీల్ పోల్స్, పైకప్పునకు సీలింగ్ వంటి హంగులు అద్దారు. రెండేళ్ల కిందట ఆయా బస్టాపులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే ఆ తరువాత బస్టాపుల నిర్వహణపై అధికారులు దృష్టిసారించలేదు. దీంతో బస్టాపుల ముందు ఏర్పాటు చేసిన నేమ్‌బోర్డులు, సీలింగ్‌లు ఊడిపోయాయి.ప్రస్తుతం మద్దిలపాలెం జంక్షన్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు జాతీయ రహదారికి ఇరువైపులా నిర్మించిన స్మార్ట్ బస్టాపుల్లో లైట్లు వెలగడం లేదు. దీనివల్ల రాత్రివేళ బస్టాపుల వద్ద అంధకారం రాజ్యమేలుతోంది.షెల్టర్‌లలో చీకటిగా ఉండడంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపైనే వేచి ఉంటున్నారు. అదేసమయంలో ఖాళీగా ఉంటున్న బస్టాపులను ఆకతాయిలు, భిక్షాటన చేసుకునేవారు ఆవాసాలుగా మార్చుకుంటున్నారు. బస్టాపుల వద్ద లైట్లను మరమ్మతు చేసి లైటింగ్‌ను పునరుద్ధరించాల్సిన జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఆపని తమది కాదన్నట్టు చోద్యం చూస్తున్నారు. ఈ విషయం జీవీఎంసీ ఎలక్ట్రికల్ విభాగం ఎస్ఈ సంపత్‌కుమార్ వద్ద ప్రస్తావించగా, బస్టాప్‌ల లైటింగ్‌కు, తమకు సంబంధం లేదన్నారు. మరి బస్టాప్‌లలో లైట్లను వెలిగించే బాధ్యత ఎవరిదో ఉన్నతాధికారులే చెప్పాలి.

ఉక్కు సీఎండీని కలిసిన కలెక్టర్

... 5వ పేజీ తరువాయి

నడుస్తున్న విశాఖ విమల విద్యాలయాన్ని తిరిగి తెరవాలని, వీలు కాకపోతే అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వీఆర్ఎస్ ద్వారా సెటిల్‌మెంట్ చేయాలని కలెక్టర్ కోరినట్టు సమాచారం. విద్యాలయాన్ని నడిపే ఉద్దేశం లేకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని కలెక్టర్ ప్రతిపాదించినట్టు తెలిసింది. కాగా, స్టీల్ ప్లాంటులో 3.5 ఎకరాల భూమిని జీవీఎంసీ 33 ఏళ్లకు లీజుకు తీసుకొని వాటర్ ట్యాంకు నిర్మించింది. ఏలేరు కాలువ ద్వారా వచ్చే గోదావరి నీటిని అక్కడికి పంపింగ్ చేసి గాజువాక ప్రజలకు అందిస్తోంది. తాజాగా ఆ పక్కనే మరో వాటర్ ట్యాంకు కూడా నిర్మిస్తోంది. లీజు కాలం ముగియడంతో దానిని పునరుద్ధరించాలని కలెక్టర్ కోరినట్టు సమాచారం. ఇటీవల కాలంలో స్టీల్ ప్లాంటు భూములకు సంబంధించిన ఎటువంటి పొడిగింపులు ఇవ్వకుండా వాటిని వెనక్కి తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం కలెక్టర్ స్వయంగా వెళ్లి కలిసి మాట్లాడారని ఉక్కు ఉద్యోగ వర్గాలు తెలిపాయి.

యోగా గణపతిగా సంపత్ వినాయగర్



యోగా గణపతిగా పూజలు అందుకుంటున్న సంపత్ వినాయగర్

సిరిపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :ఆశీల్‌మెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయంలోని నిర్వహిస్తున్న నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 8వ రోజైన బుధవారం స్వామివారు యోగా గణపతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే స్వామివారికి గణపతి హోమం, నాదస్వరం, ఉభయదాతలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం భక్తులకు నారాయణ సేవ నిర్వహించినట్టు ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని సాంస్కృతిక కళా వేదిక వద్ద నాదస్వర కచేరి, కోలాటం, బ్రహ్మశ్రీ డాక్టర్ వెంపరాల వేంకట లక్ష్మీశ్రీనివాస మూర్తి 'వినాయక వైభవం'పై ప్రవచనం గావించారు. తదుపరి హారతి, ప్రసాద వితరణ చేపట్టారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హిందీ పక్షోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న ఈఎన్‌సీ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ మురళీమోహన్‌రాజు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నావికాదళంలో మంగళవారం నుంచి హిందీ పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈఎన్‌సీ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ ఎం.మురళీమోహన్‌రాజు ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ హిందీ పక్షోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో తూర్పు నావికాదళానికి చెందిన వివిధ నౌకల సిబ్బంది, సివిలియన్స్ పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా వివిధ అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్టు, ఇందులో విజేతలకు హిందీ పక్షోత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల 17 నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు ప్రకటించారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 29, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 26, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 46, బంగాళదుంపలు 19, అరటికాయ (పె) 10, మునక్కాడలు (కిలో) 62, అల్లం (పాతది) 74, బరబాటి 32, ముల్లంగి 40, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వె ల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 62, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	121
లైవ్ ధర	141
విత్ స్కిన్	252
స్కిన్‌లెస్	262

దేశ నిర్మాణంలో జాతీయ సేవా పథకం కీలకం

» ఏయూ వీసీ రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న ఏయూ వీసీ, పాల్గొన్న ఏయూ అధికారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశ నిర్మాణంలో జాతీయ సేవా పథకం వలంటీర్లు కీలక భూమిక పోషించాలని ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రి రిపబ్లిక్ డే ఎంపిక కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సహజ నైపుణ్యాలతో రాణించాలన్నారు. సామర్థ్యాలను మెరుగుపరచుకుంటూ సాగాలన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మెగా ఈవెంట్ నిర్వహించాలని సూచించారు. సమావేశానికి గౌరవ అతిథిగా హాజరైన జాతీయ సేవా పథకం ప్రాంతీయ కేంద్ర యువజన అధికారి సైదా రమావత్ పారదర్శకంగా, ప్రతిభఆధారంగా పూర్వ గణతంత్ర శిబిరానికి వలంటీర్లను ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్రీయ జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ ఎం.సుధాకర్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో ఏయూ అగ్రభాగాన ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు వలంటీర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డి.సింహాచలం, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, ప్రోగ్రామ్ అధికారులు, జోనల్ అధికారి డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

10వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటర్ రామలక్ష్మి, పాల్గొన్న టీడీపీ నేతలు

ఆరిలోవ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులో సుమారు రూ.74 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మిరాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ హయాంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాత డెయిరీ ఫారం సమీపంలో గల ఇందిరా నగర్‌లో రోడ్లు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు .కార్యక్రమంలో టీడీపీ 10వ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయడు, జనసేన నాయకులు బండి రాజారమేష్, బీజేపీ నాయకులు దొంతల రమణ, క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిల రాజేష్, స్థానిక నేతలు కుందూరు కొండమ్మ, తులసీపార్వతి, జీవీఎంసీ ఏఈ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

19వ వార్డులో అన్న సమారాధన



భక్తులకు వడ్డిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి తనయుడు ప్రతాపరుద్ర

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా పలు చోట్ల బుధవారం అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేటలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ యువనేత వెలగపూడి ప్రతాప్‌రుద్ర పాల్గొన్నారు. ఎంవీపీ కాలనీ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన కుంకుమ పూజలకు ప్రత్యేక అతిథిగా వెళ్లారు.

సుగాలి ప్రీతి హత్య కేసుపై ప్రభుత్వాల అలసత్వం

» జైభీమ్ పార్టీ వ్యవస్థాపకుడు జడ శ్రావణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రవణ్‌కుమార్, పాల్గొన్న దళిత, ఆదివాసీ సంఘాల నేతలు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పద్నాలుగేళ్ల గిరిజన బాలిక సుగాలి ప్రీతి దారుణ హత్యకు గురై ఎనిమిదేళ్లయినా నిందితులను పట్టుకోవడంలో ప్రభుత్వాలు తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నాయని జైభీమ్ పార్టీ వ్యవస్థాపకుడు జడ శ్రావణ్‌కుమార్ విమర్శించారు. ఎంవీపీ కాలనీలోని గిరిజన్ భవన్‌లో బుధవారం దళిత, ఆదివాసీ సంఘాల నాయకులతో 'జస్టిస్ ఫర్ సుగాలి ప్రీతి' పేరిట రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దళిత, ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ రాజకీయ ఒత్తిడులతోనే కేసు నీరుగారుతోందని ఆరోపించారు. సుగాలి ప్రీతి కుటుంబానికి న్యాయం చేసేందుకు సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలని, రాష్ట్రపతి, గవర్నర్లకు వినతి పత్రాలను సమర్పించాలని నాయకులు నిర్ణయించారు. పలువురు దళిత, ఆదివాసీ నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

గ్రేటర్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకుసాగాలి

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును సత్కరిస్తున్న 22వ వార్డు టీడీపీ నూతన కమిటీ సభ్యులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాబేయే జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి పార్టీల విజయమే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సూచించారు. నూతనంగా ఎన్నికైన టీడీపీ 22వ వార్డు కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డులోని కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ప్రజల పక్షాన నిలబడాలన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలన్నారు. అర్హులకు పథకాలు అందకపోతే వారికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి అప్పారావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు కోడిబోయిన ఆనంద్, కార్యదర్శి మల్లా రవి, యువజన అధ్యక్షుడు ఎస్కే మదీనా, యూత్ కార్యదర్శి గుండాల శంకర్, మహిళా అధ్యక్షురాలు గుణలక్ష్మి, కార్యదర్శి మండా శ్రీదేవి, వార్డు మాజీ అధ్యక్షుడు దువ్వి స్వామి పాల్గొన్నారు.

13న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పర్యటనను విజయవంతం చేయాలి

» ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు



సమావేశంలో పాల్గొన్న ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పరశురామ్‌రాజు, బీజేపీ ఇతర నేతలు

పెదవాల్తేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్ రాజు ఆధ్వర్యంలో నగర బీజేపీ కార్యాలయంలో బుధవారం జిల్లా పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ నెల 13న విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్ర మోహన్, ఉమ్మిడి సుజాత రాజ్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎ.కేశవకాంత్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కే.సుహాసిని ఆనంద్, బీజేపీ పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎస్వీఎస్ ప్రకాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుద్ధ లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాడి పురుషోత్తం రమేష్, సిరసపల్లి నూకరాజు, జిల్లా పదాధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏయూ లా కళాశాలలో రక్తదానం



రక్తదానం చేస్తున్న లా కళాశాల విద్యార్థులు, పాల్గొన్న ఆచార్యులు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏయూ పూర్వపు ఉపకులపతిగా, భారత రాష్ట్రపతిగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు నిరుపమానమని ఏయూ న్యాయకళాశాల ప్రిన్సిపాల్ కె.సీతామాణిక్యం అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ నేపథ్యంలో బుధవారం ఏయూ న్యాయ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతామాణిక్యం మాట్లాడుతూ ఏయూలో తత్వశాస్త్ర విభాగం ఏర్పాటు చేసి. దాని అభివృద్ధికి సర్వేపల్లి విశేష కృషి చేశారన్నారు. అలాగే ఏయూలో అనేక విద్యా సంస్కరణలు చేపట్టారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదానం శిబిరంలో పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో న్యాయకళాశాల ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ ట్రైనింగ్ క్యాంప్



ట్రైనింగ్ క్యాంప్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్స్

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐఎన్ఎస్ విశ్వకర్మలో పది రోజుల పాటు జరిగిన ఎన్‌సీసీ క్యాడెట్స్ ట్రైనింగ్ క్యాంప్ బుధవారంతో ముగిసింది. 395 మంది క్యాడెట్స్ విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. నేవల్ మెడికల్ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ సర్జన్ కమాండర్ ఎ.నరసింహారావు ఆధ్వర్యంలో క్రమశిక్షణ, డ్రిల్, యోగా, కమ్యూనికేషన్, నేవిగేషన్, తేలిక ఆయుధాల వినియోగం, ప్రథమ చికిత్స నేవల్ ఓరియంటేషన్ వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చారు.విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్‌లు పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రూపు కమాండర్ సుమంత్‌రాయ్ పాల్గొన్నారు.

అక్షరాస్యతా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, రెక్టార్ కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ కె.రాంబాబు, డీన్ హరినాథ్, అసోసియేట్ డీన్ సౌజన్య

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 8న ఆంధ్రవిశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ బుధవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులను భాగస్వాములుగా చేస్తూ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ కె.రాంబాబు, విద్యార్థి వ్యవహారాల డీన్ ఎస్.హరినాథ్, అసోసియేట్ డీన్ డాక్టర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

20 డిఫెన్స్ మద్యం బాటిళ్ల స్వాధీనం : నిందితుడి అరెస్టు

ఆరిలోవ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : డిఫెన్స్ మద్యం బాటిళ్లను తరలిస్తున్న పైనాపిల్ కాలనీకి చెందిన పోలాకి జీవన్ రావును(55) టాస్క్‌ఫోర్స్ పోలీసులు దారపాలెం వద్ద అదుపులోకి తీసుకున్నట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. నిందితుడి నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. గురువారం రిమాండ్‌కు తరలించనున్నట్టు సీఐ తెలిపారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బాద్రపద మాసం శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెంలోని శ్రీవైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీవారి కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. సుమారు 60 జంటలు పాల్గొని శ్రీవారి కల్యాణాన్ని నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం అధ్యక్షులు ఆడారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీలా ప్రేమ్‌కిరణ్, జగదీశ్, ఇతర గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌ను తోరణాలతో అలంకరించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

» జోన్-3 సమీక్షలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

» ప్లాన్ మంజూరు ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు సిబ్బందికి షోకాజ్ నోటీసులు



జోన్-3 అధికారులు, సిబ్బందితో సమావేశమైన కమిషనర్ కేతన్ గార్గ్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతి అధికారి తమ విభాగాలపై పట్టు సాధించడమే కాకుండా అంకితభావంతో విధులు నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జీవీఎంసీ 3వ జోన్ జోనల్ కార్యాలయంలో జోనల్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. 3వ జోన్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులు, పనులు జరుగుతున్న తీరు గురించి ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి ఆరా తీశారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహించకుండా సహాయక ఇంజనీర్లు పూర్తి బాధ్యత వహించాలన్నారు. అనధికార కట్టడాలు, వాటిపై తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. అనధికార నిర్మాణాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయరాదని స్పష్టం చేశారు. రోడ్డు విస్తరణ పనులు ఉంటే వాటిని వెంటనే మొదలు పెట్టేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌కు సూచించారు. ప్లాన్ మంజూరుకు సంబంధించిన దరఖాస్తును రెండు రోజుల కంటే ఎక్కువ కాలం తమ లాగిన్‌లో ఉంచకుండా పై అధికారులకు పంపించాలని ఆదేశించారు. ఇప్పటికే రెండు రోజుల కంటే ఎక్కువ రోజులు తమ లాగిన్‌లో ఉంచుకున్న బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, సాయిబాబుతో పాటు ప్లానింగ్ కార్యదర్శి విష్ణుకుమార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆస్తి పన్ను, నీటి చార్జీలు, అద్దెలు, ఆశీలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆస్తి పన్నులు తదితర వాటిని శత శాతం వసూలు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహాల లబ్ధిదారులకు కేటాయించిన గృహాల్లో ఎంతమంది నివసిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. మహిళా వికాసం, డిజిటల్ లక్ష్మి పథకాల కార్యక్రమంలో భాగంగా ఎస్‌హెచ్‌జీలకు కల్పించిన పథకాలపై యూసీడీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రాత్రి బసల ఆశ్రయ కేంద్రాల నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలన్నారు. రాత్రి పారిశుధ్య పనుల నిర్వహణలో లోపాలు ఉండకూడదని ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు.

కేంద్ర కారాగారంలో ఖైదీల తనిఖీ


» నెలవారీ సమీక్షలో భాగంగా నిషేధిత వస్తువులపై నిఘా



జైలులో తనిఖీలు చేపడుతుండడంతో బయటే వేచి ఉన్న ములాఖత్‌కు వచ్చిన ఖైదీల కుటుంబ సభ్యులు, బంధువులు

ఆరిలోవ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీలను తనిఖీ చేసేందుకు ఉద్దేశించి ప్రతి నెలా నిర్వహించే అలారంను బుధవారం ఉదయం 10 : 30 గంటలకు మోగించారు. ఆ సమయంలో సిబ్బందిని మినహా వేరెవ్వరినీ లోపలకు పంపలేదు. ఖైదీలను కలిసేందుకు ములాఖత్‌కు వచ్చిన వారిని కూడా బయట ఉంచారు. దీనిపై కేంద్ర కారాగారం డెప్యూటీ సూపరింటెండెంట్ సాయిప్రవీణ్ మాట్లాడుతూ.. ప్రతి నెలా ఏదో ఒకసారి ఇలా అలారం మోగించి, ఆ సమయంలో జైలు ఉన్న ఖైదీల వద్దకు సిబ్బంది వెళ్లి క్షుణ్ణంగా తనిఖీలు చేపడతారని తెలిపారు. వారి వద్ద ఏవైనా నిషేధిత వస్తువులు ఉంటే వాటిని స్వాధీనం చేసుకోవడం చేస్తామన్నారు. కాగా, ఖైదీల వద్ద ఎలాంటి నిషేధిత వస్తువులు లభించలేదని తెలిపారు.

5న దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం



వివరాలు వెల్లడిస్తున్న వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్త స్నాతకోత్సవాన్ని (8, 9, 10, 11, 12వ స్నాతకోత్సవాలు) ఈ నెల ఐదో తేదీన నిర్వహించనున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు వెల్లడించారు. బుధవారం డాబాగార్డెన్స్ లోని ఒక హోటల్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు బీచ్‌రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో సాత్నకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నరసింహ గౌరవ అతిథిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మహేశ్వరి విశిష్ట అతిథిగా హాజరుకానున్నట్టు తెలిపారు. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ విశిష్ట అతిథిగా హాజరవుతారన్నారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, డీఎస్ఎన్ఎల్‌యూ గౌరవ చాన్సలర్‌జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహిస్తారన్నారు. అదేవిధంగా డీఎస్ఎన్ఎల్‌యూలో నూతనంగా నిర్మించిన అకడమిక్ బ్లాక్, ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇతర భవనాలను ఐదో తేదీ సాయంత్రం 4.30 గంటలకు అతిథుల చేతులు మీదుగా ప్రారంభించనున్నట్టు తెలిపారు. ప్రముఖుల విగ్రహాల ఆవిష్కరణ ఉంటుందన్నారు.

ఎంఎల్‌బీటీ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ప్రారంభం

పెదవాల్తేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బాల్యం నుంచే విద్యార్థులకు శాస్త్ర, వైజ్ఞానిక అంశాల్లో అవగాహన కల్పించడం అవసరమని గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ కళాశాల డైరెక్టర్ డి.గిరిధర్ పేర్కొన్నారు. ఈస్టు పాయింట్ కాలనీలో గల గాయత్రీ విద్యాపరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో అత్యాధునికంగా రూపొందించిన సైన్సు ల్యాబ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యం నుంచే ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా కృత్రిమ మేధ, సాంకేతిక అంశాలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. త్వరలోనే గాయత్రీ విద్యాపరిషత్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ నుంచి నిపుణులైన అధ్యాపకులు, సాంకేతిక నిపుణులు విద్యార్థులకు శిక్షణ ఇస్తారని వివరించారు. అనంతరం గాయత్రీ విద్యాపరిషత్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కంప్యూటర్ విభాగం డీన్ ఆచార్య గిట్టకవి సరిత మాట్లాడుతూ తొలి దశలో 8, 9వ తరగతి విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన కోర్సును నేర్పిస్తామన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ఉన్నతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి, లాలం రాజేష్, సైన్సు ఉపాధాయులు కిరణ్మయి, మాధురి, అరుణ, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

మద్దిలపాలెం, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధిక మార్కులు సాధించిన పది మంది విద్యార్థులకు బుధవారం వాసవీ క్లబ్ ప్రతినిధులు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.సుజాత మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు అండగా నిలిచి ప్రోత్సాహం అందించడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధి శ్రీరామ్మూర్తి, అధ్యాపకులు వేదవ్యాస్, బి.సన్యాసిరావు, బాలమురళి, ఆర్పీ నాయుడు పాల్గొన్నారు.



సీతంపేట కూడలిలో గల దుర్గాగణపతి బుధవారం త్రిముఖ గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. -ఆంధ్రజ్యోతి-సీతంపేట



అక్కయ్యపాలెంలోని ఆంధ్రజ్యోతి కార్యాలయం సమీపంలో బుధవారం వాద్య గణపతిగా దర్శనమిచ్చిన లక్ష్మీగణపతి -ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం

నగరంలో శాంతిర్యాలీ రేపు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న మిలాదున్ నబీ సందర్భంగా మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సీరత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మునీర్ ఖాన్ బాబా తెలిపారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం మధ్యాహ్నం శాంతిర్యాలీ నిర్వహించి మహ్మద్ ప్రవక్త బోధనలు ప్రచారం చేస్తామన్నారు. సమావేశంలో కమిటీ ప్రతినిధులు ఎస్‌ఏకే జిలానీ, ఎస్‌ఏ ఆసిఫ్, బర్కత్ ఆలీ, అబ్బాస్ హుస్సేన్, ఐ.హెచ్.ఫారుక్, హైదర్ ఆలీ సింకా పాల్గొన్నారు.

ఆంధ్రనాట్యంపై 12న సదస్సు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రనాట్యంపై మూడు రోజులు సదస్సు నిర్వహిస్తున్నట్టు నటరాజ్ మ్యూజిక్ అండ్ అకాడమీ వ్యవస్థాపకుడు బి.ఆర్.విక్రమ్ కుమార్ తెలిపారు. ఆంధ్ర నాట్యం నిపుణులు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డా.కలాకృష్ణ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 14 వరకు రోజూ సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల వరకు కళాభారతి ఆడిటోరియంలో సదస్సు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పదేళ్ల వయసు దాటిన వారంతా పాల్గొనవచ్చునన్నారు. ఔత్సాహికులు తమ పేర్లను ఈ నెల 8లోగా ఫోన్ నెంబరు (98481 37445)లో నమోదు చేసుకోవాలని సూచించారు.

మంచి సేవలతోనే గుర్తింపు



ఉద్యోగ విరమణ పొందిన జసింతను సత్కరిస్తున్న సోమేశ్వర్రావు, ఉపాధ్యాయులు

కంచరపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనదని జిల్లా ఉప విద్యాశాఖాధికారి అంబటి సోమేశ్వర్రావు అన్నారు. కంచరపాలెం పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన మేరీ జసింత సన్మాన సభ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమేశ్వర్రావు మాట్లాడుతూ విధి నిర్వహణలో అందించిన సేవలే మంచి గుర్తింపును, ఆనందాన్ని కల్గిస్తాయన్నారు. ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన జసింత సేవలు నిరుపమానమన్నారు. అనంతరం జసింతను ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎస్.పి.నాయుడు, టి.శ్రీనివాసరావు, నాగేశ్వర్రావు, సీహెచ్.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అత్యున్నత ప్రమాణాలు పాటించాలి: డీఆర్ఎం



డీఆర్ఎం కార్యాలయంలో అధికారులతో సమావేశమైన తూర్పుకోస్తారైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎం) రీటారాజ్, చిత్రంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా, సీనియర్ డీసీఎం కె.సందీప్ తదితరులు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వేకు చెందిన మర్రిపాలెంలోని బహుళ క్రమశిక్షణ శిక్షణ కేంద్రాన్ని డీఆర్ఎం లలిత్ బొహ్రా బుధవారం తనిఖీ చేశారు. ఈ కేంద్రంలో లోకో పైలట్లు, సహాయ లోకో పైలట్లు, రైలు మేనేజర్లకు ఇస్తున్న శిక్షణ కార్యకలాపాలను పరిశీలించారు. శిక్షణ పొందుతున్న ఉద్యోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, తరగతి గదులు, వంట గదిని తనిఖీ చేసి పారిశుధ్యం, పరిశుభ్రత నిర్వహణను పరిశీలించారు. అనంతరం శిక్షణ పొందుతున్న ఉద్యోగులతో మాట్లాడుతూ భారతీయ రైల్వేలో ఉద్యోగుల పాత్రను వివరించి వృత్తిపరమైన విధుల్లో అత్యున్నత ప్రమాణాలు పాటించి నిబద్ధత, అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఇటువంటి కేంద్రాల వద్ద ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో పీసీసీఎం తనిఖీలు

తూర్పుకోస్తారైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎం) రీటారాజ్ బుధవారం విశాఖ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇటీవల నూతన పీసీసీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆమె తొలిసారిగా విశాఖ రైల్వే స్టేషన్‌లో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. స్టేషన్‌లో ప్రయాణికులకు కల్పించిన మౌలిక సౌకర్యాలు, వాణిజ్య సదుపాయాలతోపాటు పారిశుధ్యం నిర్వహణను తనిఖీ చేశారు. అలాగే స్టేషన్‌లో కొనసాగుతున్న ఎస్ఎఫ్ఆర్ ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం డీఆర్ఎం కార్యాలయంలో అధికారులతో సమావేశమై కొనసాగుతున్న అభివృద్ధి కార్యకలాపాలు, ప్రయాణికుల సౌకర్యాలు, వాణిజ్య కార్యకలాపాలు వంటి అంశాలతోపాటు భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించారు. సీనియర్ డీసీఎం కె.సందీప్ పలు అంశాలను పీసీసీఎంకు వివరించారు.

అందరిలో దైవభక్తి ఉండాలి: వంశీకృష్ణ



వడ్డిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరిలో దైవభక్తి ఉండాలని, తద్వారా మానసిక ప్రశాంతత, లక్ష్య సాధనకు వీలుపడుతుందని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద జరిగిన మహా అన్న సమారాధన కార్యక్రమానికి ఆయన హాజరై భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ప్రతీ ఒక్కరూ పాల్గొనడం సంతోషదాయకమన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చెట్ల కొమ్మల తొలగింపు, హెచ్‌టీ విద్యుత్ లైన్స్ నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా గురువారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సీతమ్మధార ఏఎస్ఆర్ నగర్, క్షత్రియ కల్యాణమండపం, సీతారామరాజు విగ్రహ ప్రాంతం, నార్త్ ఎక్స్‌టెన్సన్ లేఅవుట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రలు ఆపాలి

ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్ కలెక్టరేట్ వద్ద ఆందోళన



కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల జేఏసీ నేతలు

మహారాణిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈవోఐ పేరుతో ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే కుట్రలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలిపివేయాలని కార్మిక, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో జగదాంబ జంక్షన్ నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో 46 విభాగాల ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ, ఈ నెల 9న బిడ్లు వేయాలని కోరుతూ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ప్లాంట్‌ను ముక్కలు చేసి ప్రైవేట్‌కు కట్టబెట్టే చర్యలతో కార్మికుల జీవనోపాధి, జాతి ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ప్లాంట్‌ను కాపాడాల్సిన ఎంపీ భరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మోదీ ప్రభుత్వానికి భజన చేయడం దారుణమన్నారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, విశాఖ స్టీల్‌కు సొంతగనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేసి, ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏడాదిగా ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదని జగ్గునాయుడు విమర్శించారు. ప్లాంట్‌ను కాపాడాలన్న చిత్తశుద్ధి కనబరచకపోతే కూటమి ప్రభుత్వానికి సరైన సమయంలో తగిన శాస్తి జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉక్కు జేఏసీ చైర్మన్ డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎన్.కనకా రావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఎం.మన్మథరావు, బి.నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరితోటలో అన్నదానం



పంక్తిలో శీతల పానీయాల సీసాలు

అల్లిపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 34వ వార్డు పరిధి కొబ్బరి తోటలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదానం అందరినీ అబ్బురపరిచింది. స్థానిక యువకులు వినూత్న రీతిలో భక్తులకు భోజనం సమకూర్చారు. అన్నదానానికి వచ్చిన ప్రతి భక్తునికి 25 రకాలతో వడ్డించారు. ఇందులో 2 లీటర్ల శీతల పానీయాలు, లస్సీలు,పండ్ల రసాలు, వివిధ రకాల మిఠాయిలు (స్వీట్లు) ఉన్నాయి. ఈ కార్యక్రమాన్ని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. వందలాది మందితో అన్నదాన ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఎమ్మెల్యే చేతులమీదుగా భక్తులకు స్టీల్ బేసిన్‌లు కూడా అందించడం విశేషం.

సమస్యల పరిష్కారానికి డిమాండ్



అక్కయ్యపాలెంలోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల వద్దకు ఆహారం సరఫరా చేసే స్విగ్గీ, జుమాటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని విశాఖ జిల్లా గౌరవాధ్యక్షుడు కేఎం కుమారమంగళం, అధ్యక్షుడు బి. జగన్ కార్మిక శాఖ కమిషనర్‌ను కోరారు. అక్కయ్యపాలెంలోని కార్మికశాఖ కార్యాలయం ఎదుట బుధవారం నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ స్విగ్గి, జుమాటో యాజమాన్యాలతో అనేకమార్లు చర్చలు జరిపినా ఇప్పటి వరకు సమస్యలు పరిష్కరించలేదన్నారు. అందువల్ల వారాంతాల్లో (శని, ఆదివారాలు) స్విగ్గీ, జుమాటోని బంద్ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

ప్రజల బాగు కోరుకుంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడు

జగన్‌కు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్ సలహా

మహారాణిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల బాగు కోరుకుంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని మాజీ సీఎం జగన్మోహనరెడ్డికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ సూచించారు. ప్రతిపక్ష హోదాను అడుక్కునే స్థాయికి దిగజారిపోయారని ఎద్దేవా చేశారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరులతో నజీర్ మాట్లాడుతూ పులివెందుల జడ్పీటీసీ ఓటమి తరువాత జగన్ అయోమయంలో ఉంటూ టీడీపీ బంగాళాఖాతంలో కలసిపోతుందని పగటికలలు కంటున్నారని ఆక్షేపించారు. సూపర్ సిక్స్ పథకాలు కూటమి ప్రభుత్వం అద్భుతంగా అమలు చేస్తున్నందుకా? అని ప్రశ్నించారు. కేవలం పది మందితో పులివెందుల పంచాయతీలలో రోడ్డు షో చేసుకొనే స్థాయికి దిగజారిపోయారని పేర్కొన్నారు. 2029లో వైసీపీ తరఫున పోటీ చేయటానికి ఎవరూ ఇష్టపడరన్నారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజలు రాష్ట్రంలో తిరగకుండా చేస్తారని నజీర్ హెచ్చరించారు.



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు

వైరస్ పరిశోధనా ల్యాబ్ పునఃప్రారంభం

మహారాణిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్, ఆంధ్ర వైద్య కళాశాల (ఏఎంసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైక్రోబయాలజీ విభాగంలోని వైరస్ పరిశోధనా డయాగ్నస్టిక్ ల్యాబ్‌ను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా బుధవారం ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఇతర వైద్యాధికారులు దీన్ని ప్రారంభించారు. కోవిడ్ 19, డెంగ్యూ, చికున్ గున్యా, స్వైన్ ఫ్లూ వంటి వైరల్ వ్యాధులకు సిరోలాజికల్ మాలిక్యూలర్ డయాగ్నస్టిక్ పరీక్షలు ప్రస్తుతం పునఃప్రారంభించిన వీడీఆర్ఎల్ ల్యాబ్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగాధిపతి పి.రత్నకుమారి, డాక్టర్ శివ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సంక్షేమానికి బాట వేసేదే కవిత్వం



సమావేశంలో మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అక్షరాలు, భాష, మాట సమన్వయంతో కూడినప్పుడు కవిత పుట్టుకొస్తుందని, మాట కవిత్వంగా ధ్వనించాలంటే, రుషితత్వం కావాలని సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లో గల ప్రిజమ్ కళాశాల్లో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ అసలైన కవిత్వం ప్రజల సమస్యల్ని, కన్నీళ్లను సముదాయించి, సమాజ సంక్షేమానికి బాట కావాలన్నారు. ఆలోచనలు కవితా ప్రపంచానికి ప్రవేశ ద్వారాలన్నారు. చల్లా రాంబాబు కవితలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వినయభూషణ్, కె.రామ్, చినసూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం

198 అంశాలతో అజెండా

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం జరగనున్నట్టు జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. ఇందుకోసం 198 అంశాలతో అజెండా తయారుచేసి సభ్యులకు అందజేశామన్నారు. నీటిసరఫరా పైప్‌లైన్‌ల మరమ్మతులు, కొత్తవాల్వ్‌ల ఏర్పాటు, ఫెర్రిక్‌ఆలం, నీటిశుద్ధి రసాయనాల కొనుగోలు, ట్యాంకర్లను అద్దెప్రాతిపదికన తీసుకోవడం వంటి 50 అంశాలను పొందుపరిచారు. కొన్ని జోన్‌ల పరిధిలోని చెత్త ట్రాన్స్‌ఫర్‌స్టేషన్ల వద్ద తడి-పొడి చెత్త విభజనకు ర్యాగ్‌పిక్కలను నెలవారీ అద్దెప్రాతిపదికన ఏడాది కాలానికి విధుల్లోకి తీసుకోవడం, తాత్కాలిక పారిశుధ్య కార్మికులకు వేతనాల చెల్లింపు, డ్రెయిన్‌లు, కల్వర్టులు, భవనాలు, రోడ్ల నిర్మాణాలు, గెడ్డల్లో పూడికతీతకు యంత్రాలను సమకూర్చడం, బీచ్‌రోడ్డులో పారిశుధ్య నిర్వహణకు నియమించిన తాత్కాలిక కార్మికులకు వేతనాల చెల్లింపు, పారిశుధ్య కార్మికులకు యాప్రాన్‌లు కొనుగోలు, జీవీఎంసీ వాణిజ్య సముదాయాల్లోని దుకాణాల వేలం, నిరాశ్రయుల కోసం జీవీఎంసీ నిర్వహిస్తున్న ఆశ్రయ కేంద్రాల నిర్వహణను ఎన్‌జీవోలకు అప్పగించడం వంటి అంశాలను అజెండాలో చేర్చారు.

విజయవాడ బ్లాస్టర్స్‌పై తుంగభద్ర దివాస్ గెలుపు

ఆంధ్ర ఉమెన్ టీ20...

విశాఖపట్నం-స్పోర్ట్స్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ఉమెన్ టీ20 లీగ్ టోర్నీలో భాగంగా బుధవారం ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో తుంగభద్ర దివాస్ రెండు పరుగుల తేడాతో విజయవాడ బ్లాస్టర్స్‌పై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ బ్లాస్టర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 146 పరుగులు చేసింది. మేఘన (32), శేతుసాయి అర్థ సెంచరీ (64), రంగలక్ష్మి (28) రాణించారు. తుంగభద్ర బౌలర్ పూజితకు రెండు వికెట్లు దక్కాయి. వర్షం కారణంగా కొద్దిసేపు మ్యాచ్ నిలిచిపోవడంతో వీజేడీ మెథడ్ విధానం ప్రకారం తుంగభద్ర దివాస్‌కు 12.4 ఓవర్లలో 81 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. తుంగభద్ర దివాస్ 12.4 ఓవర్లలో 82 పరుగులు చేసి అనూహ్యంగా విజయం సాధించింది. కె.దీక్ష (27), హాసిని (39), పద్మజ (10 నాటౌట్) రాణించి జట్టుకు విజయాన్నందించారు.

డాబాగార్డెన్స్‌లో ఇష్టానుసారంగా వైర్లు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్, లీలామహల్, శారదాస్ట్రీట్ ప్రాంతాల్లో ఇష్టానుసారంగా పిచ్చుకగూళ్లను తలపించేలా వివిధ టెలిఫోన్, విద్యుత్ స్తంభాలకు వైర్లు ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలోని కొన్ని వైర్లు ఏకంగా రోడ్డుపైకి తెగిపోవడంతో పాటు కొన్ని గుట్టలుగా కిందకు వేలాడుతున్నాయి. ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించేవారి సంఖ్య గణనీయంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో పాదచారులు ఈ రోడ్డులో వర్షం నీటిలో నడిచేటప్పుడు ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారో అధికారులకే తెలియాల్సి ఉంది. కనీసం పర్యవేక్షణ లేకపోవడంతో స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వైర్లు గమనించక ఇటీవల కొందరు జారిపడుతున్నారు.వృద్ధులు, చిన్నారులు రాత్రి వేళ ఇటువైపుగా వెళ్లే సమయంలో పక్కనే ఉన్న కాలువల్లోకి పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను చక్కదిద్దాలని కోరుతున్నారు.

చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు

... 5వ పేజీ తరువాయి

నలుగురికి శస్త్ర చికిత్సలు నిర్వహించాల్సిన అవసరం ఏర్పడుతోంది. గతంతో పోలిస్తే ఈ తరహా బాధిత చిన్నారులు పెరుగుతున్నట్టు చెబుతున్నారు. సాధారణ ప్రసవాల్లో వేయి మందిలో 8 మందికి గుండె జబ్బు ఉంటే, ఐవీఎఫ్, ఇతర పద్ధతుల్లో పుట్టే చిన్నారుల్లో 15 నుంచి 20 మందికి గుండె సమస్యలు ఉంటున్నట్టు పేర్కొంటున్నారు. గుండె శస్త్రచికిత్సల నిర్వహణకు కార్పొరేటు ఆస్పత్రుల్లో అయితే కనీసం రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఖర్చవుతుంది. అంత ఖర్చు చేసే స్థోమత సాధారణ, మధ్య తరగతి కుటుంబాలకు ఉండదు. అటువంటి వారికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహణకు నిర్ణయించింది.

ఇవీ లక్షణాలు..

శిశువుల్లో గుండె సంబంధిత సమస్యలను ప్రసవానికి ముందే గుర్తించేందుకు అవకాశం ఉంది. యాంటినాటల్ స్కానింగ్ చేయడం ద్వారా ముందే సమస్యను గుర్తించి అందుకు అనుగుణమైన వైద్యం అందించడం ద్వారా కోలుకునేలా చేయవచ్చు. అయితే, వంద మంది గర్భిణుల్లో పది మంది కూడా ఈ తరహా స్కానింగ్స్ చేయించుకోవడం లేదని, దీనివల్లే గుండె జబ్బులతో పుట్టే చిన్నారుల సంఖ్య పెరుగుతోందని వైద్యులు పేర్కొంటున్నారు. ఆయాసం, తీవ్రమైన దగ్గు, గుండె వేగంగా కొట్టుకోవడం, ఎప్పటికప్పుడు అనారోగ్యానికి గురవుతుండడం, ఎదుగుదల లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యుల వద్దకు తీసుకువెళ్లాలి.

ఎందుకు సమస్య

జన్యుపరమైన అంశాలు, మేనరిక వివాహాలు, పోషకాహారలోపం, 35 ఏళ్లు దాటిన తరువాత వివాహాలు, ఐవీఎఫ్ వంటి పద్ధతుల్లో పిల్లలను కనడం వంటివి చిన్నారుల్లో గుండె జబ్బులకు కారణమవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.

ప్రాథమిక దశలో గుర్తించేందుకు స్క్రీనింగ్

చిన్నారుల్లో ఉన్న అనారోగ్య సమస్యలను గుర్తించేందుకు ఏడాదికి రెండుసార్లు హెల్త్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆశ, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ వెళ్లి స్క్రీనింగ్ చేస్తారు. ఎత్తు, బరువు, హెచ్‌బీతోపాటు ఇతర పరీక్షలు నిర్వహిస్తారు. సమస్య ఉన్నట్టు గుర్తించిన వారిని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి మరిన్ని పరీక్షలు చేస్తారు. అక్కడ ఏదైనా సమస్య ఉంటే జిల్లాస్థాయిలో ఉన్న డీఈఐసీకి రిఫర్ చేస్తారు. అక్కడ మరిన్ని పరీక్షలు నిర్వహించి తీవ్రమైన సమస్య ఉన్న వారికి శస్త్ర చికిత్సలు చేయిస్తాం. ఇప్పటివరకు గుండె జబ్బులు ఉన్న చిన్నారులను తిరుపతి పంపించి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నాం. ఇకపై ఇక్కడే నిర్వహించేలా ప్రభుత్వం ఒక ప్రైవేటు ఆస్పత్రిని ఎంపిక చేసింది. ప్రస్తుతం నెలకు ఒకటి, రెండు కేసులు తిరుపతికి పంపిస్తున్నాం. వారికి ఇక్కడే శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నాం. కొద్దిరోజుల్లో ఆస్పత్రితో కలిసి ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తాం. - డాక్టర్ బి.హారిక, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్

ఉక్కు సీఎండీని కలిసిన కలెక్టర్

... 5వ పేజీ తరువాయి

నడుస్తున్న విశాఖ విమల విద్యాలయాన్ని తిరిగి తెరవాలని, వీలు కాకపోతే అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వీఆర్ఎస్ ద్వారా సెటిల్‌మెంట్ చేయాలని కలెక్టర్ కోరినట్టు సమాచారం. విద్యాలయాన్ని నడిపే ఉద్దేశం లేకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని కలెక్టర్ ప్రతిపాదించినట్టు తెలిసింది. కాగా, స్టీల్‌ప్లాంటులో 3.5 ఎకరాల భూమిని జీవీఎంసీ 33 ఏళ్లకు లీజుకు తీసుకొని వాటర్ ట్యాంకు నిర్మించింది. ఏలేరు కాలువ ద్వారా వచ్చే గోదావరి నీటిని అక్కడికి పంపింగ్ చేసి గాజువాక ప్రజలకు అందిస్తోంది. తాజాగా ఆ పక్కనే మరో వాటర్ ట్యాంకు కూడా నిర్మిస్తోంది. లీజు కాలం ముగియడంతో దానిని పునరుద్ధరించాలని కలెక్టర్ కోరినట్టు సమాచారం. ఇటీవల కాలంలో స్టీల్ ప్లాంటు భూములకు సంబంధించిన ఎటువంటి పొడిగింపులు ఇవ్వకుండా వాటిని వెనక్కి తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం కలెక్టర్ స్వయంగా వెళ్లి కలిసి మాట్లాడారని ఉక్కు ఉద్యోగ వర్గాలు తెలిపాయి.

స్మార్ట్ బస్టాపుల్లో అంధకారం!

... 5వ పేజీ తరువాయి

గ్రానైట్ పలకలతో కూడిన అరుగు, స్టెయిన్‌లెస్ స్టీల్ పోల్స్, పైకప్పునకు సీలింగ్ వంటి హంగులు అద్దారు. రెండేళ్ల కిందట ఆయా బస్టాపులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే ఆ తరువాత బస్టాపుల నిర్వహణపై అధికారులు దృష్టిసారించలేదు. దీంతో బస్టాపుల ముందు ఏర్పాటుచేసిన నేమ్‌బోర్డులు, సీలింగ్‌లు ఊడిపోయాయి. ప్రస్తుతం మద్దిలపాలెం జంక్షన్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు జాతీయ రహదారికి ఇరువైపులా నిర్మించిన స్మార్ట్ బస్టాపుల్లో లైట్లు వెలగడం లేదు. దీనివల్ల రాత్రివేళ బస్టాపుల వద్ద అంధకారం రాజ్యమేలుతోంది. షెల్టర్‌లలో చీకటిగా ఉండడంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపైనే వేచి ఉంటున్నారు. అదేసమయంలో ఖాళీగా ఉంటున్న బస్టాపులను ఆకతాయిలు, భిక్షాటన చేసుకునేవారు ఆవాసాలుగా మార్చుకుంటున్నారు. బస్టాపుల వద్ద లైట్లను మరమ్మతు చేసి లైటింగ్‌ను పునరుద్ధరించాల్సిన జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఆపని తమది కాదన్నట్టు చోద్యం చూస్తున్నారు. ఈ విషయం జీవీఎంసీ ఎలక్ట్రికల్ విభాగం ఎస్ఈ సంపత్‌కుమార్ వద్ద ప్రస్తావించగా, బస్టాప్‌ల లైటింగ్‌కు, తమకు సంబంధం లేదన్నారు. మరి బస్టాప్‌లలో లైట్లను వెలిగించే బాధ్యత ఎవరిదో ఉన్నతాధికారులే చెప్పాలి.

రేషన్ బియ్యం పంపిణీకి బ్రేక్

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖ సర్వర్ పనిచేయకపోడంతో రెండు రోజులుగా కార్డుదారులకు బియ్యం పంపిణీ నిలిచిపోయింది. ఒకటో తేదీన బాగానే పనిచేసిన సర్వర్ మంగళవారం ఉదయం 11 గంటల తరువాత మొరాయించింది. బుధవారం రాత్రికి కూడా సమస్య పరిష్కారం కాలేదు. కార్డుదారులు రేషన్ డిపోల వద్ద గంట, రెండు గంటలు నిరీక్షించి వెనుతిరుగుతున్నారు.

కార్డుదారులకు బియ్యం, పంచదార పంపిణీ చేసేందుకు ప్రతి డిపోకు తూకపు యంత్రాలు ఇచ్చారు. ఆ యంత్రాలను ఈపోస్ మిషన్‌కు అనుసంధానం చేశారు. తూకపు యంత్రానికి, సర్వర్‌కు మధ్య అనుసంధానం చేసే బ్లూటూత్ కనెక్షన్ పనిచేయకపోవడంతో బియ్యం పంపిణీ నిలిచిపోయింది.

జిల్లాలోని 642 రేషన్ డిపోలకు రెండు కంపెనీలకు చెందిన తూకపు యంత్రాలు (బ్లూటూత్‌తో కూడినవి) ఇచ్చారు. అందులో 485 డిపోల్లో మిషన్లు పనిచేయకపోవడంతో డీలర్లు, కార్డుదారులు ఇబ్బందిపడ్డారు.

మంగళవారం ఉదయం నుంచి సర్వర్ పనిచేయక బియ్యం, పంచదార పంపిణీ నిలిచిపోవడంతో కొన్నిచోట్ల డీలర్లతో గొడవకు దిగారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి మంగళవారం ఉదయం 11 గంటల వరకూ జిల్లాలో 5,21,382 కార్డుదారులకుగాను 1,61,987 మందికి (31 శాతం) బియ్యం పంపిణీ చేశామని జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల తరువాత సాంకేతిక సమస్యతో సర్వర్ జామ్ అయిందన్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలో సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

ఆర్ఈసీఎస్ ఉద్యోగులకు ఝలక్

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సరఫరా సంఘం (ఆర్ఈసీఎస్) ఉద్యోగులకు హైకోర్టు ఝలక్ ఇచ్చింది. కేసు తేలేంత వరకూ పాత జీతాలే ఇవ్వాలని ఈపీడీసీఎల్‌ను ఆదేశించింది. దాంతో అధికారులు ఆగస్టు నెల జీతాల కింద పీఆర్‌సీకి ముందు మొత్తాలే విడుదల చేశారు. ఒక్కో ఉద్యోగికి సగటున రూ.20వేలు తగ్గిపోయింది. సొసైటీలో అడ్డగోలు వ్యవహారాలు జరుగుతున్నాయని 'ఆంధ్రజ్యోతి' ఎప్పటికప్పుడు కథనాలు ప్రచురిస్తూనే ఉంది. ఇటీవల శాశ్వత ఉద్యోగులు 72 మంది తమకు పే రివిజన్ కమిషన్ 2022 సిఫారసుల ప్రకారం జీతాలు ఇవ్వాలని ఈపీడీసీఎల్ అధికారులను కోరారు. దీనికి గతంలో సొసైటీ చేసిన పాత తీర్మానం కాపీని జతచేశారు. అంతా కుమ్మక్కు అయిపోవడంతో ఈ ఏడాది మే నెలలో వారికి ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు జీతాలు పెంచుతూ పీఆర్‌సీ ఇచ్చారు. అయితే వారిలో కొందరు అతి తక్కువ కాలంలో రెండేసి ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు తీసుకున్నారని, సస్పెన్షన్‌లో ఉన్నవారు కూడా పదోన్నతులు తీసుకున్నారని, అర్హతలు లేకుండా ప్రమోషన్ పొందారని సర్వీస్ రికార్డుల పరిశీలన ద్వారా ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు గుర్తించారు. అటువంటి వారందరికీ జూలై నెలలో పాత జీతాలనే ఇచ్చారు. దీనిపై గుర్రుమన్న ఉద్యోగులు కొందరు హైకోర్టును ఆశ్రయించారు. తమకు ఇచ్చినవి వెనక్కి తీసుకున్నారని పిటిషన్ వేశారు. పూర్తి జీతాలు ఇప్పించాలని కోరారు. ఇదే సమయంలో పీఆర్‌సీ ప్రస్తావన కూడా వచ్చింది. సొసైటీలకు పీఆర్‌సీ ఎలా ఇస్తారంటూ వాదనలు జరిగాయి. ఈ నేపథ్యంలో తీర్పు వచ్చేంత వరకు ఉద్యోగులకు పాత జీతాలనే ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. దాంతో ఈపీడీసీఎల్ అధికారులు పీఆర్‌సీ ఇవ్వడానికి ముందు అంటే 2025 మే నెలకు ముందు ఏ జీతాలు ఇచ్చారో వాటినే సెప్టెంబరు 1, 2 తేదీలతో ఉద్యోగుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు.

యోగా గణపతిగా సంపత్ వినాయగర్



యోగా గణపతిగా పూజలు అందుకుంటున్న సంపత్ వినాయగర్

సిరిపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :ఆశీల్‌మెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయంలోని నిర్వహిస్తున్న నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 8వ రోజైన బుధవారం స్వామివారు యోగా గణపతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే స్వామివారికి గణపతి హోమం, నాదస్వరం, ఉభయదాతలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం భక్తులకు నారాయణ సేవ నిర్వహించినట్టు ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని సాంస్కృతిక కళా వేదిక వద్ద నాదస్వర కచేరి, కోలాటం, బ్రహ్మశ్రీ డాక్టర్ వెంపరాల వేంకట లక్ష్మీశ్రీనివాస మూర్తి 'వినాయక వైభవం'పై ప్రవచనం గావించారు. తదుపరి హారతి, ప్రసాద వితరణ చేపట్టారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హిందీ పక్షోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న ఈఎన్‌సీ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ మురళీమోహన్‌రాజు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నావికాదళంలో మంగళవారం నుంచి హిందీ పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈఎన్‌సీ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ ఎం.మురళీమోహన్‌రాజు ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ హిందీ పక్షోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో తూర్పు నావికాదళానికి చెందిన వివిధ నౌకల సిబ్బంది, సివిలియన్స్ పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా వివిధ అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్టు, ఇందులో విజేతలకు హిందీ పక్షోత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల 17 నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు ప్రకటించారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 29, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 26, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 46, బంగాళదుంపలు 19, అరటికాయ (పె) 10, మునక్కాడలు (కిలో) 62, అల్లం (పాతది) 74, బరబాటి 32, ముల్లంగి 40, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 62, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	121
లైవ్ ధర	141
విత్ స్కిన్	252
స్కిన్‌లెస్	262

దేశ నిర్మాణంలో జాతీయ సేవా పథకం కీలకం

» ఏయూ వీసీ రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న ఏయూ వీసీ, పాల్గొన్న ఏయూ అధికారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశ నిర్మాణంలో జాతీయ సేవా పథకం వలంటీర్లు కీలక భూమిక పోషించాలని ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రి రిపబ్లిక్ డే ఎంపిక కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సహజ నైపుణ్యాలతో రాణించాలన్నారు. సామర్థ్యాలను మెరుగుపరచుకుంటూ సాగాలన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మెగా ఈవెంట్ నిర్వహించాలని సూచించారు. సమావేశానికి గౌరవ అతిథిగా హాజరైన జాతీయ సేవా పథకం ప్రాంతీయ కేంద్ర యువజన అధికారి సైదా రమావత్ పారదర్శకంగా, ప్రతిభఆధారంగా పూర్వ గణతంత్ర శిబిరానికి వలంటీర్లను ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్రీయ జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ ఎం.సుధాకర్ మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో ఏయూ అగ్రభాగాన ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు వలంటీర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డి.సింహాచలం, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, ప్రోగ్రామ్ అధికారులు, జోనల్ అధికారి డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

10వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటర్ రామలక్ష్మి, పాల్గొన్న టీడీపీ నేతలు

ఆరిలోవ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులో సుమారు రూ.74 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ హయాంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాత డెయిరీ ఫారం సమీపంలో గల ఇందిరా నగర్‌లో రోడ్లు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు .కార్యక్రమంలో టీడీపీ 10వ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయడు, జనసేన నాయకులు బండి రాజారమేష్, బీజేపీ నాయకులు దొంతల రమణ, క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిల రాజేష్, స్థానిక నేతలు కుందూరు కొండమ్మ, తులసీపార్వతి, జీవీఎంసీ ఏఈ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

19వ వార్డులో అన్న సమారాధన



భక్తులకు వడ్డిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి తనయుడు ప్రతాపరుద్ర

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా పలు చోట్ల బుధవారం అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేటలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ యువనేత వెలగపూడి ప్రతాప్‌రుద్ర పాల్గొన్నారు. ఎంవీపీ కాలనీ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన కుంకుమ పూజలకు ప్రత్యేక అతిథిగా వెళ్లారు.

సుగాలి ప్రీతి హత్య కేసుపై ప్రభుత్వాల అలసత్వం

» జైభీమ్ పార్టీ వ్యవస్థాపకుడు జడ శ్రావణ్‌కుమార్



సమావేశంలోమాట్లాడుతున్న శ్రవణ్‌కుమార్, పాల్గొన్న దళిత, ఆదివాసీ సంఘాల నేతలు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పద్నాలుగేళ్ల గిరిజన బాలిక సుగాలి ప్రీతి దారుణ హత్యకు గురై ఎనిమిదేళ్లయినా నిందితులను పట్టుకోవడంలో ప్రభుత్వాలు తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నాయని జైభీమ్ పార్టీ వ్యవస్థాపకుడు జడ శ్రావణ్‌కుమార్ విమర్శించారు. ఎంవీపీ కాలనీలోని గిరిజన్ భవన్‌లో బుధవారం దళిత, ఆదివాసీ సంఘాల నాయకులతో 'జస్టిస్ ఫర్ సుగాలి ప్రీతి' పేరిట రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దళిత, ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ రాజకీయ ఒత్తిడులతోనే కేసు నీరుగారుతోందని ఆరోపించారు. సుగాలి ప్రీతి కుటుంబానికి న్యాయం చేసేందుకు సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలని, రాష్ట్రపతి, గవర్నర్లకు వినతి పత్రాలను సమర్పించాలని నాయకులు నిర్ణయించారు. పలువురు దళిత, ఆదివాసీ నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

గ్రేటర్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకుసాగాలి

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును సత్కరిస్తున్న 22వ వార్డు టీడీపీ నూతన కమిటీ సభ్యులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాబోయే జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి పార్టీల విజయమే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సూచించారు. నూతనంగా ఎన్నికైన టీడీపీ 22వ వార్డు కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డులోని కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ప్రజల పక్షాన నిలబడాలన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలన్నారు. అర్హులకు పథకాలు అందకపోతే వారికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి అప్పారావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు కోడిబోయిన ఆనంద్, కార్యదర్శి మల్లా రవి, యువజన అధ్యక్షుడు ఎస్కే మదీనా, యూత్ కార్యదర్శి గుండాల శంకర్, మహిళా అధ్యక్షురాలు గుణలక్ష్మి, కార్యదర్శి మండా శ్రీదేవి, వార్డు మాజీ అధ్యక్షుడు దువ్వి స్వామి పాల్గొన్నారు.

13న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పర్యటనను విజయవంతం చేయాలి

» ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు



సమావేశంలో పాల్గొన్న ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పరశురామ్‌రాజు, బీజేపీ ఇతర నేతలు

పెదవాల్తేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్ రాజు ఆధ్వర్యంలో నగర బీజేపీ కార్యాలయంలో బుధవారం జిల్లా పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ నెల 13న విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్ర మోహన్, ఉమ్మిడి సుజాత రాజ్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎ.కేశవకాంత్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కే.సుహాసిని ఆనంద్, బీజేపీ పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎస్వీఎస్ ప్రకాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుద్ద లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాడి పురుషోత్తం రమేష్, సిరసపల్లి నూకరాజు, జిల్లా పదాధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏయూ లా కళాశాలలో రక్తదానం



రక్తదానం చేస్తున్న లా కళాశాల విద్యార్థులు, పాల్గొన్న ఆచార్యులు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏయూ పూర్వపు ఉపకులపతిగా, భారత రాష్ట్రపతిగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు నిరుపమానమని ఏయూ న్యాయకళాశాల ప్రిన్సిపాల్ కె.సీతామాణిక్యం అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ నేపథ్యంలో బుధవారం ఏయూ న్యాయ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతామాణిక్యం మాట్లాడుతూ ఏయూలో తత్వశాస్త్ర విభాగం ఏర్పాటు చేసి. దాని అభివృద్ధికి సర్వేపల్లి విశేష కృషి చేశారన్నారు. అలాగే ఏయూలో అనేక విద్యా సంస్కరణలు చేపట్టారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదానం శిబిరంలో పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో న్యాయకళాశాల ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షరాస్యతా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, రెక్టార్ కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ కె.రాంబాబు, డీన్ హరినాథ్, అసోసియేట్ డీన్ సౌజన్య

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 8న ఆంధ్రవిశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ జీవీ రాజశేఖర్ బుధవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులను భాగస్వాములుగా చేస్తూ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ కె.రాంబాబు, విద్యార్థి వ్యవహారాల డీన్ ఎస్.హరినాథ్, అసోసియేట్ డీన్ డాక్టర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ ట్రైనింగ్ క్యాంప్



ట్రైనింగ్ క్యాంప్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్స్

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌ఎస్ విశ్వకర్మలో పది రోజుల పాటు జరిగిన ఎన్‌సీసీ క్యాడెట్స్ ట్రైనింగ్ క్యాంప్ బుధవారంతో ముగిసింది. 395 మంది క్యాడెట్స్ విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. నేవల్ మెడికల్ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ సర్జన్ కమాండర్ ఎ.నరసింహారావు ఆధ్వర్యంలో క్రమశిక్షణ, డ్రిల్, యోగా, కమ్యూనికేషన్, నేవిగేషన్, తేలిక ఆయుధాల వినియోగం, ప్రథమ చికిత్స, నేవల్ ఓరియంటేషన్ వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చారు.విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్‌లు పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రూపు కమాండర్ సుమంత్‌రాయ్ పాల్గొన్నారు.

20 డిఫెన్స్ మద్యం బాటిళ్ల స్వాధీనం : నిందితుడి అరెస్టు

ఆరిలోవ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : డిఫెన్స్ మద్యం బాటిళ్లను తరలిస్తున్న పైనాపిల్ కాలనీకి చెందిన పోలాకి జీవన్ రావును(55) టాస్క్‌ఫోర్స్ పోలీసులు దారపాలెం వద్ద అదుపులోకి తీసుకున్నట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. నిందితుడి నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. గురువారం రిమాండ్‌కు తరలించనున్నట్టు సీఐ తెలిపారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బాద్రపద మాసం శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెంలోని శ్రీవైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీవారి కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. సుమారు 60 జంటలు పాల్గొని శ్రీవారి కల్యాణాన్ని నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం అధ్యక్షులు ఆడారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీలా ప్రేమ్‌కిరణ్, జగదీశ్, ఇతర గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌ను తోరణాలతో అలంకరించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

» జోన్-3 సమీక్షలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

» ప్లాన్ మంజూరు ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు సిబ్బందికి షోకాజ్ నోటీసులు



జోన్-3 అధికారులు, సిబ్బందితో సమావేశమైన కమిషనర్ కేతన్ గార్గ్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతి అధికారి తమ విభాగాలపై పట్టు సాధించడమే కాకుండా అంకితభావంతో విధులు నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జీవీఎంసీ 3వ జోన్ జోనల్ కార్యాలయంలో జోనల్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. 3వ జోన్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులు, పనులు జరుగుతున్న తీరు గురించి ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి ఆరా తీశారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహించకుండా సహాయక ఇంజనీర్లు పూర్తి బాధ్యత వహించాలన్నారు. అనధికార కట్టడాలు, వాటిపై తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. అనధికార నిర్మాణాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయరాదని స్పష్టం చేశారు. రోడ్డు విస్తరణ పనులు ఉంటే వాటిని వెంటనే మొదలు పెట్టేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌కు సూచించారు. ప్లాన్ మంజూరుకు సంబంధించిన దరఖాస్తును రెండు రోజుల కంటే ఎక్కువ కాలం తమ లాగిన్‌లో ఉంచకుండా పై అధికారులకు పంపించాలని ఆదేశించారు. ఇప్పటికే రెండు రోజుల కంటే ఎక్కువ రోజులు తమ లాగిన్‌లో ఉంచుకున్న బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, సాయిబాబుతో పాటు ప్లానింగ్ కార్యదర్శి విష్ణుకుమార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆస్తి పన్ను, నీటి చార్జీలు, అద్దెలు, ఆశీలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆస్తి పన్నులు తదితర వాటిని శత శాతం వసూలు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహాల లబ్ధిదారులకు కేటాయించిన గృహాల్లో ఎంతమంది నివసిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. మహిళా వికాసం, డిజిటల్ లక్ష్మి పథకాల కార్యక్రమంలో భాగంగా ఎస్‌హెచ్‌జీలకు కల్పించిన పథకాలపై యూసీడీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రాత్రి బసల ఆశ్రయ కేంద్రాల నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలన్నారు. రాత్రి పారిశుధ్య పనుల నిర్వహణలో లోపాలు ఉండకూడదని ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు.

కేంద్ర కారాగారంలో ఖైదీల తనిఖీ


» నెలవారీ సమీక్షలో భాగంగా నిషేధిత వస్తువులపై నిఘా



జైలులో తనిఖీలు చేపడుతుండడంతో బయటే వేచి ఉన్న ములాఖత్‌కు వచ్చిన ఖైదీల కుటుంబ సభ్యులు, బంధువులు

ఆరిలోవ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీలను తనిఖీ చేసేందుకు ఉద్దేశించి ప్రతి నెలా నిర్వహించే అలారంను బుధవారం ఉదయం 10 : 30 గంటలకు మోగించారు. ఆ సమయంలో సిబ్బందిని మినహా వేరెవ్వరినీ లోపలకు పంపలేదు. ఖైదీలను కలిసేందుకు ములాఖత్‌కు వచ్చిన వారిని కూడా బయట ఉంచారు. దీనిపై కేంద్ర కారాగారం డెప్యూటీ సూపరింటెండెంట్ సాయిప్రవీణ్ మాట్లాడుతూ.. ప్రతి నెలా ఏదో ఒకసారి ఇలా అలారం మోగించి, ఆ సమయంలో జైలు ఉన్న ఖైదీల వద్దకు సిబ్బంది వెళ్లి క్షుణ్ణంగా తనిఖీలు చేపడతారని తెలిపారు. వారి వద్ద ఏవైనా నిషేధిత వస్తువులు ఉంటే వాటిని స్వాధీనం చేసుకోవడం చేస్తామన్నారు. కాగా, ఖైదీల వద్ద ఎలాంటి నిషేధిత వస్తువులు లభించలేదని తెలిపారు.

5న దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం



వివరాలు వెల్లడిస్తున్న వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్త స్నాతకోత్సవాన్ని (8, 9, 10, 11, 12వ స్నాతకోత్సవాలు) ఈ నెల ఐదో తేదీన నిర్వహించనున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు వెల్లడించారు. బుధవారం డాబాగార్డెన్స్‌లోని ఒక హోటల్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు బీచ్‌రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నరసింహ గౌరవ అతిథిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మహేశ్వరి విశిష్ట అతిథిగా హాజరుకానున్నట్టు తెలిపారు. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ విశిష్ట అతిథిగా హాజరవుతారన్నారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, డీఎస్‌ఎన్ఎల్‌యూ గౌరవ చాన్సలర్‌జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహిస్తారన్నారు. అదేవిధంగా డీఎస్ఎన్ఎల్‌యూలో నూతనంగా నిర్మించిన అకడమిక్ బ్లాక్, ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇతర భవనాలను ఐదో తేదీ సాయంత్రం 4.30 గంటలకు అతిథుల చేతులు మీదుగా ప్రారంభించనున్నట్టు తెలిపారు. ప్రముఖుల విగ్రహాల ఆవిష్కరణ ఉంటుందన్నారు.

ఎంఎల్‌బీటీ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ప్రారంభం

పెదవాల్తేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బాల్యం నుంచే విద్యార్థులకు శాస్త్ర, వైజ్ఞానిక అంశాల్లో అవగాహన కల్పించడం అవసరమని గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ కళాశాల డైరెక్టర్ డి.గిరిధర్ పేర్కొన్నారు. ఈస్టు పాయింట్ కాలనీలో గల గాయత్రీ విద్యాపరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో అత్యాధునికంగా రూపొందించిన సైన్సు ల్యాబ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యం నుంచే ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా కృత్రిమ మేధ, సాంకేతిక అంశాలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. త్వరలోనే గాయత్రీ విద్యాపరిషత్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ నుంచి నిపుణులైన అధ్యాపకులు, సాంకేతిక నిపుణులు విద్యార్థులకు శిక్షణ ఇస్తారని వివరించారు. అనంతరం గాయత్రీ విద్యాపరిషత్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కంప్యూటర్ విభాగం డీన్ ఆచార్య గిట్టకవి సరిత మాట్లాడుతూ తొలి దశలో 8, 9వ తరగతి విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన కోర్సును నేర్పిస్తామన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ఉన్నతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి, లాలం రాజేష్, సైన్సు ఉపాధ్యాయులు కిరణ్మయి, మాధురి, అరుణ, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

మద్దిలపాలెం, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధిక మార్కులు సాధించిన పది మంది విద్యార్థులకు బుధవారం వాసవీ క్లబ్ ప్రతినిధులు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.సుజాత మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు అండగా నిలిచి ప్రోత్సాహం అందించడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధి శ్రీరామ్మూర్తి, అధ్యాపకులు వేదవ్యాస్, బి.సన్యాసిరావు, బాలమురళి, ఆర్వీ నాయుడు పాల్గొన్నారు.



సీతంపేట కూడలిలో గల దుర్గాగణపతి బుధవారం త్రిముఖ గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. -ఆంధ్రజ్యోతి-సీతంపేట



అక్కయ్యపాలెంలోని ఆంధ్రజ్యోతి కార్యాలయం సమీపంలో బుధవారం వాద్య గణపతిగా దర్శనమిచ్చిన లక్ష్మీగణపతి -ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం

నగరంలో శాంతిర్యాలీ రేపు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న మిలాదున్ నబీ సందర్భంగా మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సీరత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మునీర్ ఖాన్ బాబా తెలిపారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం మధ్యాహ్నం శాంతిర్యాలీ నిర్వహించి మహ్మద్ ప్రవక్త బోధనలు ప్రచారం చేస్తామన్నారు. సమావేశంలో కమిటీ ప్రతినిధులు ఎస్‌ఏకే జిలానీ, ఎస్ఏ ఆసిఫ్, బర్కత్ ఆలీ, అబ్బాస్ హుస్సేన్, ఐ.హెచ్.ఫారుక్, హైదర్ ఆలీ సింకా పాల్గొన్నారు.

ఆంధ్రనాట్యంపై 12న సదస్సు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రనాట్యంపై మూడు రోజులు సదస్సు నిర్వహిస్తున్నట్టు నటరాజ్ మ్యూజిక్ అండ్ అకాడమీ వ్యవస్థాపకుడు బి.ఆర్.విక్రమ్ కుమార్ తెలిపారు. ఆంధ్ర నాట్యం నిపుణులు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డా.కళాకృష్ణ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 14 వరకు రోజూ సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల వరకు కళాభారతి ఆడిటోరియంలో సదస్సు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పదేళ్ల వయసు దాటినవారంతా పాల్గొనవచ్చునన్నారు. ఔత్సాహికులు తమ పేర్లను ఈ నెల 8లోగా ఫోన్ నెంబరు (98481 37445)లో నమోదు చేసుకోవాలని సూచించారు.

మంచి సేవలతోనే గుర్తింపు



ఉద్యోగ విరమణ పొందిన జసింతను సత్కరిస్తున్న సోమేశ్వర్రావు, ఉపాధ్యాయులు

కంచరపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనదని జిల్లా ఉప విద్యాశాఖాధికారి అంబటి సోమేశ్వర్రావు అన్నారు. కంచరపాలెం పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన మేరీ జసింత సన్మాన సభ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమేశ్వర్రావు మాట్లాడుతూ విధి నిర్వహణలో అందించిన సేవలే మంచి గుర్తింపును, ఆనందాన్ని కల్గిస్తాయన్నారు. ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన జసింత సేవలు నిరుపమానమన్నారు. అనంతరం జసింతను ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎస్.పి.నాయుడు, టి.శ్రీనివాసరావు, నాగేశ్వర్రావు, సీహెచ్.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అత్యున్నత ప్రమాణాలు పాటించాలి: డీఆర్ఎం



డీఆర్ఎం కార్యాలయంలో అధికారులతో సమావేశమైన తూర్పుకోస్తారైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎం) రీటారాజ్, చిత్రంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా, సీనియర్ డీసీఎం కె.సందీప్ తదితరులు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వేకు చెందిన మర్రిపాలెంలోని బహుళ క్రమశిక్షణ శిక్షణ కేంద్రాన్ని డీఆర్ఎం లలిత్ బొహ్రా బుధవారం తనిఖీ చేశారు. ఈ కేంద్రంలో లోకో పైలట్లు, సహాయ లోకో పైలట్లు, రైలు మేనేజర్లకు ఇస్తున్న శిక్షణ కార్యకలాపాలను పరిశీలించారు. శిక్షణ పొందుతున్న ఉద్యోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, తరగతి గదులు, వంట గదిని తనిఖీ చేసి పారిశుధ్యం, పరిశుభ్రత నిర్వహణను పరిశీలించారు. అనంతరం శిక్షణ పొందుతున్న ఉద్యోగులతో మాట్లాడుతూ భారతీయ రైల్వేలో ఉద్యోగుల పాత్రను వివరించి వృత్తిపరమైన విధుల్లో అత్యున్నత ప్రమాణాలు పాటించి నిబద్ధత, అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఇటువంటి కేంద్రాల వద్ద ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో పీసీసీఎం తనిఖీలు

తూర్పుకోస్తారైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎం) రీటారాజ్ బుధవారం విశాఖ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇటీవల నూతన పీసీసీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆమె తొలిసారిగా విశాఖ రైల్వే స్టేషన్‌లో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. స్టేషన్‌లో ప్రయాణికులకు కల్పించిన మౌలిక సౌకర్యాలు, వాణిజ్య సదుపాయాలతోపాటు పారిశుధ్యం నిర్వహణను తనిఖీ చేశారు. అలాగే స్టేషన్‌లో కొనసాగుతున్న ఎస్ఎఫ్ఆర్ ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం డీఆర్ఎం కార్యాలయంలో అధికారులతో సమావేశమై కొనసాగుతున్న అభివృద్ధి కార్యకలాపాలు, ప్రయాణికుల సౌకర్యాలు, వాణిజ్య కార్యకలాపాలు వంటి అంశాలతోపాటు భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించారు. సీనియర్ డీసీఎం కె.సందీప్ పలు అంశాలను పీసీసీఎంకు వివరించారు.

అందరిలో దైవభక్తి ఉండాలి: వంశీకృష్ణ



వడ్డిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరిలో దైవభక్తి ఉండాలని, తద్వారా మానసిక ప్రశాంతత, లక్ష్య సాధనకు వీలుపడుతుందని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద జరిగిన మహా అన్న సమారాధన కార్యక్రమానికి ఆయన హాజరై భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ప్రతీ ఒక్కరూ పాల్గొనడం సంతోషదాయకమన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చెట్ల కొమ్మల తొలగింపు, హెచ్‌టీ విద్యుత్ లైన్స్ నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా గురువారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సీతమ్మధార ఏఎస్ఆర్ నగర్, క్షత్రియ కల్యాణమండపం, సీతారామరాజు విగ్రహ ప్రాంతం, నార్త్ ఎక్స్‌టెన్సన్ లేఅవుట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రలు ఆపాలి

ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్ కలెక్టరేట్ వద్ద ఆందోళన



కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల జేఏసీ నేతలు

మహారాణిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈవోఐ పేరుతో ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే కుట్రలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలిపివేయాలని కార్మిక, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో జగదాంబ జంక్షన్ నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో 46 విభాగాల ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ, ఈ నెల 9న బిడ్లు వేయాలని కోరుతూ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ప్లాంట్‌ను ముక్కలు చేసి ప్రైవేట్‌కు కట్టబెట్టే చర్యలతో కార్మికుల జీవనోపాధి, జాతి ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ప్లాంట్‌ను కాపాడాల్సిన ఎంపీ భరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మోదీ ప్రభుత్వానికి భజన చేయడం దారుణమన్నారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, విశాఖ స్టీల్‌కు సొంతగనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేసి, ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏడాదిగా ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదని జగ్గునాయుడు విమర్శించారు. ప్లాంట్‌ను కాపాడాలన్న చిత్తశుద్ధి కనబరచకపోతే కూటమి ప్రభుత్వానికి సరైన సమయంలో తగిన శాస్తి జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉక్కు జేఏసీ చైర్మన్ డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎన్.కనకా రావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఎం.మన్మథరావు, బి.నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరితోటలో అన్నదానం



పంక్తిలో శీతల పానీయాల సీసాలు

అల్లిపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 34వ వార్డు పరిధి కొబ్బరి తోటలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదానం అందరినీ అబ్బురపరిచింది. స్థానిక యువకులు వినూత్న రీతిలో భక్తులకు భోజనం సమకూర్చారు. అన్నదానానికి వచ్చిన ప్రతి భక్తునికి 25 రకాలతో వడ్డించారు. ఇందులో 2 లీటర్ల శీతల పానీయాలు, లస్సీలు,పండ్ల రసాలు, వివిధ రకాల మిఠాయిలు (స్వీట్లు) ఉన్నాయి. ఈ కార్యక్రమాన్ని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. వందలాది మందితో అన్నదాన ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఎమ్మెల్యే చేతులమీదుగా భక్తులకు స్టీల్ బేసిన్‌లు కూడా అందించడం విశేషం.

సమస్యల పరిష్కారానికి డిమాండ్



అక్కయ్యపాలెంలోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల వద్దకు ఆహారం సరఫరా చేసే స్విగ్గీ, జుమాటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని విశాఖ జిల్లా గౌరవాధ్యక్షుడు కేఎం కుమారమంగళం, అధ్యక్షుడు బి. జగన్ కార్మిక శాఖ కమిషనర్‌ను కోరారు. అక్కయ్యపాలెంలోని కార్మికశాఖ కార్యాలయం ఎదుట బుధవారం నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ స్విగ్గీ, జుమాటో యాజమాన్యాలతో అనేకమార్లు చర్చలు జరిపినా ఇప్పటి వరకు సమస్యలు పరిష్కరించలేదన్నారు. అందువల్ల వారాంతాల్లో (శని, ఆదివారాలు) స్విగ్గీ, జుమాటోని బంద్ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

ప్రజల బాగు కోరుకుంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడు

జగన్‌కు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్ సలహా

మహారాణిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల బాగు కోరుకుంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని మాజీ సీఎం జగన్మోహనరెడ్డికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ సూచించారు. ప్రతిపక్ష హోదాను అడుక్కునే స్థాయికి దిగజారిపోయారని ఎద్దేవా చేశారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరులతో నజీర్ మాట్లాడుతూ పులివెందుల జడ్పీటీసీ ఓటమి తరువాత జగన్ అయోమయంలో ఉంటూ టీడీపీ బంగాళాఖాతంలో కలసిపోతుందని పగటికలలు కంటున్నారని ఆక్షేపించారు. సూపర్ సిక్స్ పథకాలు కూటమి ప్రభుత్వం అద్భుతంగా అమలు చేస్తున్నందుకా? అని ప్రశ్నించారు. కేవలం పది మందితో పులివెందుల పంచాయతీలలో రోడ్డు షో చేసుకొనే స్థాయికి దిగజారిపోయారని పేర్కొన్నారు. 2029లో వైసీపీ తరఫున పోటీ చేయటానికి ఎవరూ ఇష్టపడరన్నారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజలు రాష్ట్రంలో తిరగకుండా చేస్తారని నజీర్ హెచ్చరించారు.



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు

వైరస్ పరిశోధనా ల్యాబ్ పునఃప్రారంభం

మహారాణిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్, ఆంధ్ర వైద్య కళాశాల (ఏఎంసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైక్రోబయాలజీ విభాగంలోని వైరస్ పరిశోధనా డయాగ్నస్టిక్ ల్యాబ్‌ను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా బుధవారం ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఇతర వైద్యాధికారులు దీన్ని ప్రారంభించారు. కోవిడ్ 19, డెంగ్యూ, చికున్ గున్యా, స్వైన్ ఫ్లూ వంటి వైరల్ వ్యాధులకు సిరోలాజికల్ మాలిక్యూలర్ డయాగ్నస్టిక్ పరీక్షలు ప్రస్తుతం పునఃప్రారంభించిన వీడీఆర్ఎల్ ల్యాబ్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగాధిపతి పి.రత్నకుమారి, డాక్టర్ శివ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సంక్షేమానికి బాట వేసేదే కవిత్వం



సమావేశంలో మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అక్షరాలు, భాష, మాట సమన్వయంతో కూడినప్పుడు కవిత పుట్టుకొస్తుందని, మాట కవిత్వంగా ధ్వనించాలంటే, రుషితత్వం కావాలని సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లో గల ప్రిజమ్ కళాశాల్లో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ అసలైన కవిత్వం ప్రజల సమస్యల్ని, కన్నీళ్లను సముదాయించి, సమాజ సంక్షేమానికి బాట కావాలన్నారు. ఆలోచనలు కవితా ప్రపంచానికి ప్రవేశ ద్వారాలన్నారు. చల్లా రాంబాబు కవితలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వినయభూషణ్, కె.రామ్, చినసూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం

198 అంశాలతో అజెండా

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం జరగనున్నట్టు జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. ఇందుకోసం 198 అంశాలతో అజెండా తయారుచేసి సభ్యులకు అందజేశామన్నారు. నీటిసరఫరా పైప్‌లైన్‌ల మరమ్మతులు, కొత్తవాల్వ్‌ల ఏర్పాటు, ఫెర్రిక్‌ఆలం, నీటిశుద్ధి రసాయనాల కొనుగోలు, ట్యాంకర్లను అద్దెప్రాతిపదికన తీసుకోవడం వంటి 50 అంశాలను పొందుపరిచారు. కొన్ని జోన్‌ల పరిధిలోని చెత్త ట్రాన్స్‌ఫర్‌స్టేషన్ల వద్ద తడి-పొడి చెత్త విభజనకు ర్యాగ్‌పిక్కలను నెలవారీ అద్దెప్రాతిపదికన ఏడాది కాలానికి విధుల్లోకి తీసుకోవడం, తాత్కాలిక పారిశుధ్య కార్మికులకు వేతనాల చెల్లింపు, డ్రెయిన్‌లు, కల్వర్టులు, భవనాలు, రోడ్ల నిర్మాణాలు, గెడ్డల్లో పూడికతీతకు యంత్రాలను సమకూర్చడం, బీచ్‌రోడ్డులో పారిశుధ్య నిర్వహణకు నియమించిన తాత్కాలిక కార్మికులకు వేతనాల చెల్లింపు, పారిశుధ్య కార్మికులకు యాప్రాన్‌లు కొనుగోలు, జీవీఎంసీ వాణిజ్య సముదాయాల్లోని దుకాణాల వేలం, నిరాశ్రయుల కోసం జీవీఎంసీ నిర్వహిస్తున్న ఆశ్రయ కేంద్రాల నిర్వహణను ఎన్‌జీవోలకు అప్పగించడం వంటి అంశాలను అజెండాలో చేర్చారు.

విజయవాడ బ్లాస్టర్స్‌పై తుంగభద్ర దివాస్ గెలుపు

ఆంధ్ర ఉమెన్ టీ20...

విశాఖపట్నం-స్పోర్ట్స్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ఉమెన్ టీ20 లీగ్ టోర్నీలో భాగంగా బుధవారం ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో తుంగభద్ర దివాస్ రెండు పరుగుల తేడాతో విజయవాడ బ్లాస్టర్స్‌పై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ బ్లాస్టర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 146 పరుగులు చేసింది. మేఘన (32), శేతుసాయి అర్ధ సెంచరీ (64), రంగలక్ష్మి (28) రాణించారు. తుంగభద్ర బౌలర్ పూజితకు రెండు వికెట్లు దక్కాయి. వర్షం కారణంగా కొద్దిసేపు మ్యాచ్ నిలిచిపోవడంతో వీజేడీ మెథడ్ విధానం ప్రకారం తుంగభద్ర దివాస్‌కు 12.4 ఓవర్లలో 81 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. తుంగభద్ర దివాస్ 12.4 ఓవర్లలో 82 పరుగులు చేసి అనూహ్యంగా విజయం సాధించింది. కె.దీక్ష (27), హాసిని (39), పద్మజ (10 నాటౌట్) రాణించి జట్టుకు విజయాన్నందించారు.

డాబాగార్డెన్స్‌లో ఇష్టానుసారంగా వైర్లు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్, లీలామహల్, శారదాస్ట్రీట్ ప్రాంతాల్లో ఇష్టానుసారంగా పిచ్చుకగూళ్లను తలపించేలా వివిధ టెలిఫోన్, విద్యుత్ స్తంభాలకు వైర్లు ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలోని కొన్ని వైర్లు ఏకంగా రోడ్డుపైకి తెగిపోవడంతో పాటు కొన్ని గుట్టలుగా కిందకు వేలాడుతున్నాయి. ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించేవారి సంఖ్య గణనీయంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో పాదచారులు ఈ రోడ్డులో వర్షం నీటిలో నడిచేటప్పుడు ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారో అధికారులకే తెలియాల్సి ఉంది. కనీసం పర్యవేక్షణ లేకపోవడంతో స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వైర్లు గమనించక ఇటీవల కొందరు జారిపడుతున్నారు.వృద్ధులు, చిన్నారులు రాత్రి వేళ ఇటువైపుగా వెళ్లే సమయంలో పక్కనే ఉన్న కాలువల్లోకి పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను చక్కదిద్దాలని కోరుతున్నారు.

చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు

... 5వ పేజీ తరువాయి

నలుగురికి శస్త్ర చికిత్సలు నిర్వహించాల్సిన అవసరం ఏర్పడుతోంది. గతంతో పోలిస్తే ఈ తరహా బాధిత చిన్నారులు పెరుగుతున్నట్టు చెబుతున్నారు. సాధారణ ప్రసవాల్లో వేయి మందిలో 8 మందికి గుండె జబ్బు ఉంటే, ఐవీఎఫ్, ఇతర పద్ధతుల్లో పుట్టే చిన్నారుల్లో 15 నుంచి 20 మందికి గుండె సమస్యలు ఉంటున్నట్టు పేర్కొంటున్నారు. గుండె శస్త్రచికిత్సల నిర్వహణకు కార్పొరేటు ఆస్పత్రుల్లో అయితే కనీసం రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఖర్చవుతుంది. అంత ఖర్చు చేసే స్థోమత సాధారణ, మధ్య తరగతి కుటుంబాలకు ఉండదు. అటువంటి వారికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహణకు నిర్ణయించింది.

ఇవీ లక్షణాలు..

శిశువుల్లో గుండె సంబంధిత సమస్యలను ప్రసవానికి ముందే గుర్తించేందుకు అవకాశం ఉంది. యాంటినాటల్ స్కానింగ్ చేయడం ద్వారా ముందే సమస్యను గుర్తించి అందుకు అనుగుణమైన వైద్యం అందించడం ద్వారా కోలుకునేలా చేయవచ్చు. అయితే, వంద మంది గర్భిణుల్లో పది మంది కూడా ఈ తరహా స్కానింగ్స్ చేయించుకోవడం లేదని, దీనివల్లే గుండె జబ్బులతో పుట్టే చిన్నారుల సంఖ్య పెరుగుతోందని వైద్యులు పేర్కొంటున్నారు. ఆయాసం, తీవ్రమైన దగ్గు, గుండె వేగంగా కొట్టుకోవడం, ఎప్పటికప్పుడు అనారోగ్యానికి గురవుతుండడం, ఎదుగుదల లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యుల వద్దకు తీసుకువెళ్లాలి.

ఎందుకు సమస్య

జన్యుపరమైన అంశాలు, మేనరిక వివాహాలు, పోషకాహారలోపం, 35 ఏళ్లు దాటిన తరువాత వివాహాలు, ఐవీఎఫ్ వంటి పద్ధతుల్లో పిల్లలను కనడం వంటివి చిన్నారుల్లో గుండె జబ్బులకు కారణమవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.

ప్రాథమిక దశలో గుర్తించేందుకు స్క్రీనింగ్

చిన్నారుల్లో ఉన్న అనారోగ్య సమస్యలను గుర్తించేందుకు ఏడాదికి రెండుసార్లు హెల్త్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆశ, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ వెళ్లి స్క్రీనింగ్ చేస్తారు. ఎత్తు, బరువు, హెచ్‌బీతోపాటు ఇతర పరీక్షలు నిర్వహిస్తారు. సమస్య ఉన్నట్టు గుర్తించిన వారిని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి మరిన్ని పరీక్షలు చేస్తారు. అక్కడ ఏదైనా సమస్య ఉంటే జిల్లాస్థాయిలో ఉన్న డీఈఐసీకి రిఫర్ చేస్తారు. అక్కడ మరిన్ని పరీక్షలు నిర్వహించి తీవ్రమైన సమస్య ఉన్న వారికి శస్త్ర చికిత్సలు చేయిస్తాం. ఇప్పటివరకు గుండె జబ్బులు ఉన్న చిన్నారులను తిరుపతి పంపించి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నాం. ఇకపై ఇక్కడే నిర్వహించేలా ప్రభుత్వం ఒక ప్రైవేటు ఆస్పత్రిని ఎంపిక చేసింది. ప్రస్తుతం నెలకు ఒకటి, రెండు కేసులు తిరుపతికి పంపిస్తున్నాం. వారికి ఇక్కడే శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నాం. కొద్దిరోజుల్లో ఆస్పత్రితో కలిసి ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తాం. - డాక్టర్ బి.హారిక, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్

ఉక్కు సీఎండీని కలిసిన కలెక్టర్

... 5వ పేజీ తరువాయి

నడుస్తున్న విశాఖ విమల విద్యాలయాన్ని తిరిగి తెరవాలని, వీలు కాకపోతే అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వీఆర్ఎస్ ద్వారా సెటిల్‌మెంట్ చేయాలని కలెక్టర్ కోరినట్టు సమాచారం. విద్యాలయాన్ని నడిపే ఉద్దేశం లేకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని కలెక్టర్ ప్రతిపాదించినట్టు తెలిసింది. కాగా, స్టీల్‌ప్లాంటులో 3.5 ఎకరాల భూమిని జీవీఎంసీ 33 ఏళ్లకు లీజుకు తీసుకొని వాటర్ ట్యాంకు నిర్మించింది. ఏలేరు కాలువ ద్వారా వచ్చే గోదావరి నీటిని అక్కడికి పంపింగ్ చేసి గాజువాక ప్రజలకు అందిస్తోంది. తాజాగా ఆ పక్కనే మరో వాటర్ ట్యాంకు కూడా నిర్మిస్తోంది. లీజు కాలం ముగియడంతో దానిని పునరుద్ధరించాలని కలెక్టర్ కోరినట్టు సమాచారం. ఇటీవల కాలంలో స్టీల్ ప్లాంటు భూములకు సంబంధించిన ఎటువంటి పొడిగింపులు ఇవ్వకుండా వాటిని వెనక్కి తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం కలెక్టర్ స్వయంగా వెళ్లి కలిసి మాట్లాడారని ఉక్కు ఉద్యోగ వర్గాలు తెలిపాయి.

స్మార్ట్ బస్టాపుల్లో అంధకారం!

... 5వ పేజీ తరువాయి

గ్రానైట్ పలకలతో కూడిన అరుగు, స్టెయిన్‌లెస్ స్టీల్ పోల్స్, పైకప్పునకు సీలింగ్ వంటి హంగులు అద్దారు. రెండేళ్ల కిందట ఆయా బస్టాపులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే ఆ తరువాత బస్టాపుల నిర్వహణపై అధికారులు దృష్టిసారించలేదు. దీంతో బస్టాపుల ముందు ఏర్పాటుచేసిన నేమ్‌బోర్డులు, సీలింగ్‌లు ఊడిపోయాయి. ప్రస్తుతం మద్దిలపాలెం జంక్షన్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు జాతీయ రహదారికి ఇరువైపులా నిర్మించిన స్మార్ట్ బస్టాపుల్లో లైట్లు వెలగడం లేదు. దీనివల్ల రాత్రివేళ బస్టాపుల వద్ద అంధకారం రాజ్యమేలుతోంది. షెల్టర్‌లలో చీకటిగా ఉండడంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపైనే వేచి ఉంటున్నారు. అదేసమయంలో ఖాళీగా ఉంటున్న బస్టాపులను ఆకతాయిలు, భిక్షాటన చేసుకునేవారు ఆవాసాలుగా మార్చుకుంటున్నారు. బస్టాపుల వద్ద లైట్లను మరమ్మతు చేసి లైటింగ్‌ను పునరుద్ధరించాల్సిన జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఆపని తమది కాదన్నట్టు చోద్యం చూస్తున్నారు. ఈ విషయం జీవీఎంసీ ఎలక్ట్రికల్ విభాగం ఎస్ఈ సంపత్‌కుమార్ వద్ద ప్రస్తావించగా, బస్టాప్‌ల లైటింగ్‌కు, తమకు సంబంధం లేదన్నారు. మరి బస్టాప్‌లలో లైట్లను వెలిగించే బాధ్యత ఎవరిదో ఉన్నతాధికారులే చెప్పాలి.

రేషన్ బియ్యం పంపిణీకి బ్రేక్

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖ సర్వర్ పనిచేయకపోడంతో రెండు రోజులుగా కార్డుదారులకు బియ్యం పంపిణీ నిలిచిపోయింది. ఒకటో తేదీన బాగానే పనిచేసిన సర్వర్ మంగళవారం ఉదయం 11 గంటల తరువాత మొరాయించింది. బుధవారం రాత్రికి కూడా సమస్య పరిష్కారం కాలేదు. కార్డుదారులు రేషన్ డిపోల వద్ద గంట, రెండు గంటలు నిరీక్షించి వెనుతిరుగుతున్నారు.

కార్డుదారులకు బియ్యం, పంచదార పంపిణీ చేసేందుకు ప్రతి డిపోకు తూకపు యంత్రాలు ఇచ్చారు. ఆ యంత్రాలను ఈపోస్ మిషన్‌కు అనుసంధానం చేశారు. తూకపు యంత్రానికి, సర్వర్‌కు మధ్య అనుసంధానం చేసే బ్లూటూత్ కనెక్షన్ పనిచేయకపోవడంతో బియ్యం పంపిణీ నిలిచిపోయింది.

జిల్లాలోని 642 రేషన్ డిపోలకు రెండు కంపెనీలకు చెందిన తూకపు యంత్రాలు (బ్లూటూత్‌తో కూడినవి) ఇచ్చారు. అందులో 485 డిపోల్లో మిషన్లు పనిచేయకపోవడంతో డీలర్లు, కార్డుదారులు ఇబ్బందిపడ్డారు.

మంగళవారం ఉదయం నుంచి సర్వర్ పనిచేయక బియ్యం, పంచదార పంపిణీ నిలిచిపోవడంతో కొన్నిచోట్ల డీలర్లతో గొడవకు దిగారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి మంగళవారం ఉదయం 11 గంటల వరకూ జిల్లాలో 5,21,382 కార్డుదారులకుగాను 1,61,987 మందికి (31 శాతం) బియ్యం పంపిణీ చేశామని జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల తరువాత సాంకేతిక సమస్యతో సర్వర్ జామ్ అయిందన్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలో సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

ఆర్ఈసీఎస్ ఉద్యోగులకు ఝలక్

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సరఫరా సంఘం (ఆర్ఈసీఎస్) ఉద్యోగులకు హైకోర్టు ఝలక్ ఇచ్చింది. కేసు తేలేంత వరకూ పాత జీతాలే ఇవ్వాలని ఈపీడీసీఎల్‌ను ఆదేశించింది. దాంతో అధికారులు ఆగస్టు నెల జీతాల కింద పీఆర్‌సీకి ముందు మొత్తాలే విడుదల చేశారు. ఒక్కో ఉద్యోగికి సగటున రూ.20వేలు తగ్గిపోయింది. సొసైటీలో అడ్డగోలు వ్యవహారాలు జరుగుతున్నాయని 'ఆంధ్రజ్యోతి' ఎప్పటికప్పుడు కథనాలు ప్రచురిస్తూనే ఉంది. ఇటీవల శాశ్వత ఉద్యోగులు 72 మంది తమకు పే రివిజన్ కమిషన్ 2022 సిఫారసుల ప్రకారం జీతాలు ఇవ్వాలని ఈపీడీసీఎల్ అధికారులను కోరారు. దీనికి గతంలో సొసైటీ చేసిన పాత తీర్మానం కాపీని జతచేశారు. అంతా కుమ్మక్కు అయిపోవడంతో ఈ ఏడాది మే నెలలో వారికి ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు జీతాలు పెంచుతూ పీఆర్‌సీ ఇచ్చారు. అయితే వారిలో కొందరు అతి తక్కువ కాలంలో రెండేసి ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు తీసుకున్నారని, సస్పెన్షన్‌లో ఉన్నవారు కూడా పదోన్నతులు తీసుకున్నారని, అర్హతలు లేకుండా ప్రమోషన్ పొందారని సర్వీస్ రికార్డుల పరిశీలన ద్వారా ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు గుర్తించారు. అటువంటి వారందరికీ జూలై నెలలో పాత జీతాలనే ఇచ్చారు. దీనిపై గుర్రుమన్న ఉద్యోగులు కొందరు హైకోర్టును ఆశ్రయించారు. తమకు ఇచ్చినవి వెనక్కి తీసుకున్నారని పిటిషన్ వేశారు. పూర్తి జీతాలు ఇప్పించాలని కోరారు. ఇదే సమయంలో పీఆర్‌సీ ప్రస్తావన కూడా వచ్చింది. సొసైటీలకు పీఆర్‌సీ ఎలా ఇస్తారంటూ వాదనలు జరిగాయి. ఈ నేపథ్యంలో తీర్పు వచ్చేంత వరకు ఉద్యోగులకు పాత జీతాలనే ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. దాంతో ఈపీడీసీఎల్ అధికారులు పీఆర్‌సీ ఇవ్వడానికి ముందు అంటే 2025 మే నెలకు ముందు ఏ జీతాలు ఇచ్చారో వాటినే సెప్టెంబరు 1, 2 తేదీలతో ఉద్యోగుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు.



గణపతికి చందనం పూజలు

అగనంపూడి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెదమడక సంపత్ వినాయక ఆలయంలో గణపతి నవరాత్రుల్లో బుధవారం స్వామివారికి విశేష చందన పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు మోటూరి వెంకటరమణ, విందుల నారాయణరావు, ఎం.నరసింగరావు, ఎం.శ్రీనివాసరావు, వి.రాము, జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించడంతో పాటు సకాలంలో పూర్తి చేయాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అధికారులు, కాంట్రాక్టరును కోరారు. వార్డు పరిధిలోని నాతయ్యపాలెంలో నిర్మిస్తున్న రహదారి, కాలువ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయా పనుల్లో నాణ్యతా ప్రమాణాలను స్థానికులు కూడా పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట నాయకులు సంద్రాన భాస్కర్, జి.నరసింగరావు, వరహాలరాజు, సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న అప్పన్న కాలనీకి చెందిన జి.మహేశ్‌కు జనసేన నాయకులు బుధవారం రూ.20 వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో నాయకలు తిప్పల రమణారెడ్డి, గుంటూరు మూర్తి, ఎం.షాలిని, కె.అరుణ, జె.అప్పలరాజు, బి.శిరీష, తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో బుధవారం సాయంత్రం భారీ వర్షానికి 70వ వార్డు పరిధి టీపీఎన్ కాలనీ జలమయమైంది. కాలువల్లోని మురుగు నీరు పలు ఇళ్లలోకి చేరడంతో దుర్గంధంతో ఇబ్బందులకు గురయ్యామని కాలనీ వాసి పీఎంఎల్ నాయుడు తెలిపారు. అలాగ 71వ వార్డు తోకాడలో పెద్దఎత్తున వర్షపు నీరు రహదారులపై ప్రవహించడంతో పాటు కాలువల్లోని వ్యర్థాలు రోడ్లపై తిష్ఠ వేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

విజ్ఞాన్ ఫార్మసీ విద్యార్థుల ర్యాలీ

అగనంపూడి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ ఫార్మసీ కాలేజీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ పోషకాహార వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం స్థానికంగా గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీని నిర్వహించారు. ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 29, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 26, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 46, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 62, అల్లం (పాతది) 74, బరబాటి 32, ముల్లంగి 40, నిమ్మకాయలు (కిలో) 65, బద్ధచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 62, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 44, కంద 40, దేముడుచిక్కుడు 74, గోరు చిక్కుడు 32, కూరపెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన(కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, బొప్పాయి 34, మామిడి అల్లం 56, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	121
లైవ్ ధర	141
విత్ స్కిన్	252
స్కిన్‌లెస్	262

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- ఎంపీ శ్రీభరత్
- ఆరు నెలల్లో ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్యను పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే 'పల్లా'



శిలాఫలకాలను ఆవిష్కరించిన శ్రీభరత్, పల్లా శ్రీనివాసరావు, తదితరులు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని, అభివృద్ధే ధ్యేయంగా ఆయన ముందుకు సాగుతున్నారని ఎంపీ శ్రీభరత్ అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడిలో బుధవారం ఆయన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి రూ.ఆరు కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎంపీ మాట్లాడుతూ నాడు స్టీల్ ప్లాంటుకు సమస్య వచ్చినప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు దానిని పరిష్కరించారని, మళ్లీ ఇప్పుడు ఉక్కు పరిరక్షణకు ఆయనే బాధ్యత వహిస్తారన్నారు. విశాఖ నగరాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు.

పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల ఏపీఐఐసీ నిర్వాసితుల భూ సమస్యను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వడ్లపూడి, పకీరుతక్యా, చట్టివానిపాలెం, యాదవ జగ్గరాజుపేట, తుంగ్లాంలలో గ్రామ సభలు నిర్వహించి అర్హులైన నిర్వాసితుల జాబితాను రూపొందించాల్సిన బాధ్యత గ్రామ పెద్దలు, కార్పొరేటర్లపై ఉందన్నారు. ఉక్కు కాంట్రాక్టు కార్మికుల నుంచి ఉద్యోగాల పేరుతో లక్షలాది రూపాయలను వసూలు చేసిన పలువురు కార్మిక సంఘ నాయకులు... ఇప్పుడు పనులు కోల్పోయిన కార్మికులు తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడుగుతుండటంతో కూటమి ప్రభుత్వంపై ఆరోపణలకు దిగుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కార్పొరేటర్ బొండా జగన్ మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యలను ఎంపీ నిధులతో పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, ఎస్ఎస్ విజయరామరాజు, నల్లూరు సూర్యనారాయణ, లక్కరాజు సోంబాబు, సూరిశెట్టి పెంటారావు, రాజన్ రాజు, డీవీ అప్పారావు, రాము, రాంబాబు, దానయ్య, కె.శ్రీనివాసనాయుడు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు చేయూత

జీవీఎంసీ 87వ వార్డు కణితి హైస్కూల్‌కు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయిని గద్దె షర్మిల అభ్యర్థన మేరకు అమెరికాలో ఉంటున్న ఆమె సోదరి గద్దె మధూలిక మింది, కణితి, నడుపూరు, అక్కిరెడ్డిపాలెం హైస్కూళ్లకు రూ.ఎనిమిది లక్షల విలువైన పుస్తకా లను వితరణగా సమకూర్చారు. వీటిని ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు బుధవారం ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ జగన్‌లు అందజేశారు. అనంతరం కణితి ఉన్నత పాఠశాలకు ఎక్సలెన్స్ అవార్డు వచ్చిన సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు మన్నాజీ, నారాయణరావు, ఆర్.నరసింగరావులను సత్కరించారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్నం పరబ్రహ్మ స్వరూపమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 86వ వార్డు పరిధి ఎన్టీఆర్ కాలనీ, రాజీవ్ నగర్, రాసాలమ్మ కాలనీల్లో బుధవారం వినాయక మండపాల వద్ద జరిగిన ప్రత్యేక పూజల్లో ఆయనతో పాటు టీడీపీ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్య నారాయణ పాల్గొన్నారు. అనంతరం వారు అన్న సమారాధనలను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, రమేశ్, నాగార్జున, జగదీశ్, సుబ్బయ్య, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి అశోక్‌నగర్ కాలనీ రెండో వీధిలో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథునికి బుధవారం ప్రత్యేక పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. సాయంత్రం మండపం వద్ద దీపారాధన చేశారు. గురువారం గణేశుని అనుపోత్సవాన్ని నిర్వహిస్తామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.



86వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో అన్న సమారాధనలో భోజనాలు వడ్డిస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు



జనసేనలో చేరిన నాయకులతో కోన తాతారావు తదితరులు

జనసేన పార్టీలో వైసీపీ నాయకుల చేరిక

అగనంపూడి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొత్తూరు, పూడివానిపాలెం గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు సాలాపు అచ్చిబాబు, బొబ్బరి అర్జునరావు, మంత్రి అప్పారావు, బొద్దపు మాణిక్యం, పి.బ్రహ్మానందం, రాధ, తదితరులు ఆ పార్టీకి రాజీనామా చేసి బుధవారం జనసేన పార్టీలో చేరారు. వీరికి జనసేన నేత, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు, పార్టీ వార్డు అధ్యక్షుడు గవర సోమశేఖర్ కండువాలు వేసి ఆహ్వానించారు. నాయకులు దాసరి త్రినాథ్, పి.వసంత రావు, జి.పైడిరాజు, సోమునాయుడు, పైడిరత్నం, కళావతి, తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు దుస్తులు, తదితరమైనవి పంపిణీ చేస్తున్న వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్ సభ్యులు

వరద బాధితులకు దుస్తుల పంపిణీ

ఆటోనగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం సమాజంలో అందరి బాధ్యత అని వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్-సింహాద్రి టీఎంటీ ఎండీ బండి సురేశ్‌కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావు అన్నారు. మంగళవారం వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్-సింహాద్రి టీఎంటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లాలోని వరద బాధితులకు దుస్తులు, రగ్గులు, టవళ్లు, బ్రెడ్లు, రస్కులు, నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. హిమ హ్యూమానిటేరియన్ సంస్థ సభ్యుడు టీవీడీ దాస్ మాట్లాడుతూ ఆపత్కాలంలో తోటివారికి సాయం చేయడం ద్వారా ఆత్మ సంతృప్తి లభిస్తుందన్నారు.

గోవుల చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

గోపాలపట్నం,సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గోవుల చోరీ కేసులో ఓ వ్యక్తిని గోపాలపట్నం పోలీసులు అరెస్టు చేశారు. సింహాచలం ప్రాంతానికి చెందిన ఎర్రా శ్రీనివాసరావుకు చెందిన మూడు ఆవులను ఈనెల 30న గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్టు గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు అందింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సింహాచలం ప్రాంతంలో రాత్రి వేళలో గోవుల్ని తరలిస్తున్న వారిపై నిఘా పెట్టారు. ఈమేరకు చోడవరం సమీపంలోని ఖండిపల్లె గ్రామానికి చెందిన ఆడారి రామచంద్రనాయుడును అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించగా గోవుల్ని చోరీ విషయాన్ని అంగీకరించాడు. అరెస్ట్ చేసి స్టేషన్ బెయిల్ మంజూరు చేసినట్టు ఎస్ఐ తేజేశ్వరావు తెలిపారు.

జర్నలిస్టులకు ప్రమాద బీమా

పెందుర్తి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అవర్ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ (ఓజా) ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వాల్మీకి నాగరాజు తెలిపారు. బుధవారం ఆయన పెందుర్తి ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టుల ప్రమాద బీమా పాలసీని ప్రారంభించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ అసోసియేషన్‌లో ఉన్న ప్రతి ఒక్క జర్నలిస్టుకు బీమా పాలసీ అందిస్తామని చెప్పారు. జర్నలిస్టులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీజేపీ నేత సురేంద్రమోహన్‌కు సత్కారం

పెందుర్తి రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కేతినేని సురేంద్రమోహన్‌ను 95వ వార్డు కార్పొరేటరు ముమ్మన దేముడు బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన చంద్రమోహన్‌ను శాలువతో సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో 95, 97 వార్డుల బీజేపీ అధ్యక్షుడు చిక్కాల సతీశ్, ఉపాధ్యక్షుడు పి.డి. ప్రసాద్, పార్టీ నాయకులు కంబోయిన వెంకట సంతోష్, రాపర్తి దుర్గా ప్రసాద్, కొత్తపల్లి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశ్‌నగర్‌లో అన్నసమారాధన

మల్కాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రకాశ్‌నగర్‌లో అంబేడ్కర్ కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పాప్‌కాన్ వినాయక మండపం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. రెండు వేలమంది భక్తులు హాజరై స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, రామకృష్ణ, కుమార్ పాల్గొన్నారు.

పాలకులు ప్రజల మన్ననలు పొందాలి

- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు
- వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



97వ వార్డులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు

పెందుర్తి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులు చేసి ప్రజల మన్ననలు పొందాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. బుధవారం ఆయన 97వ వార్డులో జోగులాంబ బస్టాప్, చాణక్యనగర్, లక్ష్మీనగర్ కిశోర్ లేఅవుట్‌లో రూ.10 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మేయరు పీలా శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో ఏకకాలంలో రూ. 10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం చిన్న విషయం కాదన్నారు. ఇదంతా కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు పట్టుదల వల్లే సాధ్యమైందని చెప్పారు. అభివృద్ధి పనులు చేసిన ప్రజాప్రతినిధులకే ప్రజలు మళ్లీ పట్టం కడతారన్నారు. వార్డుల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడమే కాకుండా త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు కూడా చేస్తామని తెలిపారు. మేయరు పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో వార్డుల అభివృద్ధికి రూ. 75 కోట్లు కేటాయించామన్నారు. ఎమ్మెల్యే మరిన్ని నిధులు కావాలని కోరితే మంజూరుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు మాట్లాడుతూ వార్డులో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి వారి మన్ననలు పొందుతామన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే, మేయరు, కార్పొరేటర్‌కు మహిళలు హారతిలిచ్చారు. డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సేనాపతి సోమశేఖర్, ఉరుకూటి లక్ష్మీ గోవింద్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

93, 94వ వార్డుల్లో...

వేపగుంట : జీవీఎంసీ 93,94వ వార్డుల్లో 5.43 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కాలువల పనులకు మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ జీవీఎంసీలోని విలీన వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత నాలుగు నెలల్లో ఒక్కో వార్డులో దాదాపు రూ. 3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్సీ కె. హైమావతి, ఎస్ఈ శ్రీనివాసరావు, ఈఈ దిలీప్, ఏఎంహెచ్ఓ బండారు అప్పలనాయుడు, ఏపీడీ చిరంజీవి, కూటమి నాయకులు వరహాలు, మహేశ్, మంగతాయరు, పిన్నింటి పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగంలో రోబోటిక్స్ పాత్ర కీలకం

అగనంపూడి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక విప్లవంలో రోబోటిక్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని రోబోకపులర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ సీఈవో ప్రవీణ్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం ఇండస్ట్రియల్ రోబోటిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఉద్యోగావకాశాలు మెరుగుపరుచుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. అనంతరం ప్రవీణ్‌ను ఘనంగా సత్కరించారు. కో-ఆర్డినేటర్ రోహిణికుమార్, ప్రిన్సిపాల్ సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై వైభవంగా పవిత్రోత్సవాలు



ఆలయంలో పండితుల పఠనం

సింహాచలం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై జరుగుతున్న అప్పన్నస్వామి పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులు, యజ్ఞమూర్తిగా సుదర్శన పెరుమాళ్‌ను ఆలయ కల్యాణ మండపంలో శోభాయమానంగా అలంకరించిన ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. శాస్త్ర విధానాన్ని అనుసరించి ఉపచారాలు సమర్పించారు. ఉదయం 7.30 గంటలకు స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో పండితులు, అధ్యాపకులు స్వామివారి సన్నిధిలో చతుర్వేదాలు, ఇతిహాసాలు, విష్ణుపురాణం, క్షేత్ర మహాత్యం వంటి పురాణాలను వినిపించి పారాయణలకు శ్రీకారం చుట్టారు. అనంతరం మండల రచన చేసి కలశారాధన, ద్వాదశ ద్వార పాలకార్చనలు, మండపారాధన, బింబారాధన జరిపి ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో ప్రత్యేక హోమాలు చేశారు. ఉదయం బాలభోగం, మధ్యాహ్నం రాజభోగ నివేదనలు చేసి, రోజంతా పండితులు పారాయణలు చేశారు. పవిత్రాలను ప్రత్యేక ఆసనంపై ఉంచి పూజలు చేసి అధివాసం చేశారు.




కార్యాలయం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పి.గణబాబు

ఎన్ఏడీ జంక్షన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వం లక్ష్యమని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. జీవీఎంసీ 52వ వార్డులోని ఎన్ఏడీ గౌరీనగర్‌లో ఏర్పాటు చేసిన పశ్చిమ నియోజకవర్గ పీ4 కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2047 నాటికి రాష్ట్రంలో నిరుపేదలు లేకుండా చేయాలన్న లక్ష్యంతో పీ4 పథకాన్ని రూపొందించారని చెప్పారు. ఆయన లక్ష్య సాధనకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో నిరు పేద కుటుంబాలను గుర్తించడం, వారిని దత్తత తీసుకొనే మార్గదర్శకులకు అను సంధానం చేయడానికి ఒక ప్రత్యేకాధికారి, ఎమ్మెల్యే సమక్షంలో సిబ్బంది ఉంటా రని చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మాధవి, జెడ్సీలు రాము, కె.హైమావతి, కార్పొరేటర్లు రమణ, వెంకట రమేష్, నరవ అనూష పాల్గొన్నారు.

5న దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్త స్నాతకోత్సవం



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్త స్నాతకోత్సవాన్ని (8, 9, 10, 11, 12వ స్నాతకోత్సవాలు) ఈ నెల ఐదో తేదీన నిర్వహించనున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు వెల్లడించారు. బుధవారం డాబాగార్డెన్స్‌లోని ఒక హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు బీచ్‌రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో సాత్నకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నరసింహ గౌరవ అతిథిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మహేశ్వరి విశిష్ట అతిథిగా హాజరుకానున్నట్టు తెలిపారు. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ విశిష్ట అతిథిగా హాజరవుతారన్నారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, డీఎస్ఎన్ఎల్‌యూ గౌరవ చాన్సలర్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహిస్తారన్నారు. అదేవిధంగా డీఎస్ఎన్ఎల్‌యూలో నూతనంగా నిర్మించిన అకడమిక్ బ్లాక్, ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇతర భవనాలను ఐదో తేదీ సాయంత్రం 4.30 గంటలకు అతిథుల చేతులు మీదుగా ప్రారంభించనున్నట్టు తెలిపారు. ప్రముఖుల విగ్రహాల ఆవిష్కరణ ఉంటుందన్నారు.

ప్రోత్సాహకాలను పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీ శ్రీభరత్



సదస్సులో మాట్లాడుతున్న శ్రీభరత్

ఆటోనగర్/అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రోత్సాహకాలను పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ శ్రీభరత్ అన్నారు. బుధవారం శీలానగర్‌లో ఎంఎస్ఎంఈ టూల్ రూమ్-సీఐటీడీ (సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్)-హైదరాబాద్, ఏపీఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, వరల్డ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో శీలానగర్‌లో నిర్వహించిన వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ రెండో రోజు అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ, రాష్ట్ర ప్రగతులు పారిశ్రామిక రంగ అభివృద్ధిపైనే ఆధారపడి ఉంటాయన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. దేశంలో అత్యధికంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను అభివృద్ధి చేసే క్రమంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో డీఐసీ జేడీ ఆదిశేషు, రీజనల్ పీఎఫ్ కమిషనర్ అమర్‌దీప్ మిశ్రా, ఐఎంసీ చైర్మన్ బీఎస్‌బీ ప్రభాకర్, సీఐటీడీ ప్రిన్సిపల్ డైరెక్టర్ టి.విజయ కృష్ణకాంత్, డిప్యూటీ డైరెక్టర్ ఎస్.వెంకటకృష్ణ, ఐలా, వాసీవా, వివిధ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వినాయక విగ్రహాల నిమజ్జనం



నిమజ్జనాలకు వచ్చిన నిర్వాహకులతో సందడిగా ఉన్న అప్పికొండ తీరం

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అప్పికొండ సముద్ర తీరంలో వినాయక నిమజ్జనాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. స్థానికంగా ప్రతిష్ఠించిన ప్రతిమలతో పాటు పారిశ్రామిక ప్రాంతంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొల్పిన భారీ వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అప్పికొండ తీరానికి తీసుకువస్తున్నారు. తీరంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌత్ ఏసీపీ వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు పటిష్ఠ చర్యలు తీసుకున్నారు. గణనాథుల విగ్రహాలను సముద్రంలో నిమజ్జనం చేసేందుకు ఉత్సవ నిర్వాహకులకు అనుమతించడం లేదు. ఇందుకోసం ప్రత్యేకంగా నియమించిన గజ ఈతగాళ్ల ద్వారానే ప్రతిమలను నిమజ్జనం చేయిస్తున్నారు. సముద్ర తీరం వద్ద ప్రతిరోజు పోలీస్ గస్తీని నిర్వహిస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న సినీ నటులు



స్వామివారి సన్నిధిలో నటులు

సింహాచలం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామిని సినీ నటులు గీతాసింగ్, చిట్టిబాబు, సుధాకర్ బుధవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ సిబ్బంది ఆత్మీయ స్వాగతం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న నటుల గోత్రనామాలతో అంత రాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

మహారాణిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, ఇతర ప్రముఖులు విశాఖ రానున్నందున కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిలు బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. ట్రై లీగల్ ఏసీఐఏఎం, ఎన్ఎల్ఐయూ (భోపాల్) సంయుక్తంగా హోటల్ రాడిసన్ బ్లూలో నిర్వహించనున్న నేషనల్ మీడియా కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. దీతో రుషికొండ హెలీప్యాడ్‌ను పరిశీలించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, న్యాయకోవిదులు సదస్సులో పాల్గొంటున్నందున భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. అధికారులు, నిర్వాహకులకు తగిన సూచనలిచ్చారు.

ఆర్టీసీ ప్రత్యామ్నాయ సర్వీసులు

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూర్మన్నపాలెం - విజయనగరం, ద్వారకాబస్‌స్టేషన్ - దువ్వాడ రైల్వేస్టేషన్ రూట్లలో 18 జేఎన్ఎన్‌యూఆర్ఎం సర్వీసులు తాత్కాలికంగా నిలిపివేశారు. వాటి స్థానంలో ప్రత్యామ్నాయంగా సర్వీసులు నడుపుతున్నారు. వాల్తేరు, మద్దిలపాలెం, విశాఖపట్నం, మధురవాడ, సింహాచలం, గాజువాక డిపోల నుంచి 18 ఎక్స్‌ప్రెస్ సర్వీసులను స్టీల్‌సిటీ డిపోనకు పంపారు. అవి బుధవారం నుంచి రవాణా సేవలందిస్తున్నాయి.

ఉక్కు పరిరక్షణపై నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉక్కు పరిరక్షణపై సీపీఐ ఆధ్వర్యంలో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.పైడిరాజు తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో కొనసాగించాలనే డిమాండ్‌తో జరిగే సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించాలని, లేదంటే సెయిల్‌లో విలీనం చేయాలని అఖిలపక్షపార్టీలు, కార్మిక, ప్రజాసంఘాలు సమావేశంలో తీర్మానం చేస్తారన్నారు.

కార్పొరేషన్లలో నలుగురి చోటు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పలు కార్పొరేషన్ల డైరెక్టర్ల పదవులను భర్తీచేసింది. ఏపీ గ్రీనింగ్ అండ్‌బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మొల్లి పెంటిరాజు (గాజువాక), స్టేట్ మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అబ్దుల్ సలీమ్ (విశాఖ పశ్చిమ) నియమించారు. నాటక అకాడమీ డైరెక్టర్లుగా కళ్లేపల్లి గణపతి (విశాఖ దక్షిణ), జ్యోతిరేఖ (విశాఖ తూర్పు) నియమితులయ్యారు. వీరంతా తెలుగుదేశం పార్టీకి చెందిన వారే.

8 నుంచి రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ పోటీలు

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8 నుంచి అనకాపల్లి జిల్లా సాలాపువానిపాలెంలో రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు, పురుషుల జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కోటేశ్వరరావు తెలిపారు. ఆసక్తి గల జట్లు 7680005666 నంబరులో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

స్నేహానికి ప్రతీక బలి ఉత్సవం

- మాడగడలో బ్రిటీష్ కాలం నుంచి కొనసాగుతున్న ఆచారం
- వరుసగా మూడేళ్లు పండగ చేస్తే మరో మూడేళ్లు బ్రేక్
- ఈ నెల 5న హాజరుకానున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అరకులోయ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాడగడ గ్రామంలో గిరిజనులు నిర్వహించే అరుదైన పండుగ గత నెల 25న ప్రారంభమైంది. బలి ఉత్సవంగా పిలిచే ఈ పండుగ 12 రోజుల పాటు నిర్వహిస్తారు. గిరిజనుల ఆహ్వానం మేరకు ఈ నెల 5న జరిగే వేడుకకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరుకానున్నారు. దీంతో పండగ విశిష్టత తెలుసుకోవాలనే ఉత్సాహం అందరిలో నెలకొంది. స్నేహానికి ప్రతీకగా నిలిచే పండగ బ్రిటీష్ కాలంలో మొదలైంది.



గెడ్డ నుంచి ఇసుకను సేకరించేందుకు పూజలు



బలి ఉత్సవంలో పూజలు చేస్తున్న అక్కాచెల్లెళ్లు

బ్రిటీష్ కాలంలో మండలంలోని సుంకరమెట్ట, కొత్తభల్లుగుడ, మాడగడ పంచాయితీలను కలుపుతూ మాడగడ ముఠాగా పిలిచేవారు. ఆ కాలంలో బలి ఉత్సవం (బలి పరోబ్) నిర్వహించేవారు. ఈ ఉత్సవాన్ని వరుసగా మూడేళ్లు నిర్వహిస్తే, ఆ తరువాత మూడేళ్లు నిర్వహించరు. 12 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవం ఆగస్టు 25న మొదలై ఈ నెల 5న ముగుస్తుంది. ఈ విశేషాలు తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ట్విట్టర్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేయడంతో అందరిలో ఆసక్తి నెలకొంది.

బలి ఉత్సవం ప్రాముఖ్యత

మాడగడ ముఠా పరిధిలోని ప్రజలు పాడి పంటలు, పశుసంపద, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రత్యేకంగా పూజలు చేస్తారు. ఎవరితోనైనా స్నేహం కోరుకునేవారు చివరి రోజు కార్యక్రమంలో బలిపుష్పాలను ఒకరి చెవిలో మరొకరు పెడతారు. అప్పటి నుంచి శాశ్వత స్నేహితులుగా గుర్తింపు పొందుతారు. మొదటిరోజు ఊర్లో ఒక ఇంటి వద్ద రాట నిలబెట్టి మహిళా పూజారులు పూజిస్తారు. 12 తెగలకు చెందిన 12 మంది అక్కాచెల్లెళ్లు (అన్నదమ్ముల భార్యలు) గెడ్డ వద్దకు వెళ్లి ఇసుకను తీసుకువస్తారు. బారికి (తలయారీ) సేకరించిన గోధుమ విత్తనాలను అక్కాచెల్లెళ్లకు నూతన వస్త్రాలు బహూకరించి అందజేస్తాడు. వారు వాటిని పొలంలో నాటుతారు. చివరి రోజున మొలకెత్తిన విత్తనాలను పొలంలో విడిచిపెడతారు. అంతకుముందు పవిత్ర గెడ్డ వద్ద స్నేహాన్ని కోరుకునే వారికి 12 మంది అక్కాచెల్లెళ్లు బలిపుష్పాలను (మొలకెత్తిన విత్తనాలు) అందిస్తారు. వీటిని ఒకరి చెవిలో మరొకరు పెట్టి స్నేహితులుగా గుర్తింపు పొందుతారు. అనంతరం వాటిని పవిత్ర గెడ్డలో విడిచిపెడతారు. వారంతా తరతరాలు శాశ్వతంగా స్నేహభావాన్ని కొనసాగించాల్సి ఉంటుంది.

ఐకమత్యంగా ఉంటేనే సమాజంలో సమున్నత గౌరవం

- గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు

సీతమ్మధార, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మనమంతా ఐకమత్యంగా ఉంటే బలంగా ఉంటూ గౌరవం పొందుతామని, మరొకరి వద్ద చులకన కాబోమని గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు వ్యాఖ్యానించారు. సీతమ్మధారలోని క్షత్రియ కల్యాణమండపంలో బుధవారం క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సభలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. క్షత్రియ సంక్షేమ సమితి అధ్యక్షుడు తిరుపతిరాజు మాట్లాడుతూ రాజకీయ పదవులకు వన్నె తెచ్చిన మహనీయుడు అశోక్ గజపతిరాజు అని కొనియాడారు. మాన్సాస్ ట్రస్ట్ ద్వారా ఎంతోమంది పేదలకు విద్యను అందించి సామాన్య పౌరునిలా తన పని తాను చేసుకుంటూ సాగుతున్నారని ప్రశంసించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ ప్రజాసేవ, రాజకీయ, సామాజిక కార్యక్రమాల్లో అశోక్ గజపతిరాజు చేసిన కృషి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం నిర్వాహకులు అశోక్ గజపతిరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సంక్షేమ సమితి ప్రతినిధులు బసవరాజు, శివాజీ రాజు, ప్రవీణ్‌రాజు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న గోవా గవర్నర్

సింహాచలం: వరాహలక్ష్మీనృసింహస్వామిని గోవా గవర్నర్, దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు సతీసమేతంగా దర్శించుకున్నారు. బుధవారం రాత్రి 6.45 గంటలకు ఆలయానికి చేరుకున్న అశోక్ దంపతులకు ఈవో వేంద్ర త్రినాథరావు, పూర్ణకుంభ స్వాగతం పలికారు. కప్పస్తంభం వద్ద ప్రార్థనలు, బేడామండప ప్రదక్షిణ చేసిన వారి గోత్రనామాలతో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమపూజలు తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను ప్రసాదాలను అందజేశారు. అశోక్ వెంట విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే పీవీజీఆర్ నాయుడు, దేవదాయశాఖ రాష్ట్ర కమిషనర్ కోదూరి రామచంద్ర మోహన్, తదితరులున్నారు.



గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజును సత్కరిస్తున్న క్షత్రియ సంఘం మహిళా ప్రతినిధులు

వినాయక ఉత్సవాల్లో ఆగని వసూళ్లు

- గాజువాకలో భక్తులపై నిర్వాహకుల దాడి
- కట్టడి చేయడంలో పోలీసుల వైఫల్యం
- కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని సాకులు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలు వ్యాపారాత్మక ఆలోచనతో నిర్వహిస్తున్నారని పత్రికలు ముందు నుంచి చెబుతున్నా అధికారులు పట్టించుకోలేదు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగి అనుమతులు ఇచ్చారు. దర్శనాలకు టిక్కెట్లు పెట్టకూడదని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. గాజువాకలో కోటి లింగాల గణపతి, లంకా మైదానంలో లక్షల చీరల గణపతి ఉత్సవాల నిర్వాహకులు ఈ సూచనను పెడచెవిన పెట్టారు. బోర్డులు తీసేసి క్యూలో నిల్చొన్న భక్తుల వద్దకు వెళ్లి టికెట్లు తీసుకోమని బలవంతం చేస్తున్నారు. ఒక్కో దర్శనానికి ఒక్కో టికెట్ పెట్టారు. ఈ విషయంలో రోజూ అక్కడ గొడవలు జరుగుతున్నాయి. తాజాగా బుధవారం లంకా మైదానంలో దర్శనానికి వచ్చిన భక్తులు నిర్వాహకులను ప్రశ్నిస్తే... వారిపై తిరగబడి కొట్టారు. పెద్ద గలాటానే జరిగింది. పోలీసులు వచ్చి సర్దుబాటు చేశారు. ఉత్సవాల వల్ల గాజువాకలో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. వాటిని పోలీసులు సరిదిద్దలేకపోతున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ, భక్తులను దోచుకుంటున్న ఉత్సవాలు వెంటనే ఎందుకు ముగించడం లేదని గాజువాక పోలీసులను ప్రశ్నిస్తే.... వారు కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారని, ఏ ప్రభుత్వ శాఖ అక్కడికి వెళ్లడానికి వీల్లేదని ఏసీపీ శ్రీనివాస్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆ కోర్టు ఆర్డర్ కాపీ ఏమిటో ఇవ్వమని కోరితే ఇవ్వలేకపోయారు. పోలీసులు నిజమే చెబుతున్నారా? నిర్వాహకులకు కొమ్ము కాస్తున్నారా? అనేది తెలియడం లేదు. ఏదేమైనా నిర్వాహకులు రాజకీయ అండతోనే భక్తులను దోచుకుంటున్నారనేది అర్థమవుతోంది. రాష్ట్రంలో ఎక్కడా లేని వ్యాపార ధోరణి విశాఖలోనే బలంగా నాటుకుపోతోంది. దీనిని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడం లేదు. అరికట్టాల్సిన బాధ్యత ఒక్క పోలీసులదేనా? జిల్లా అధికార యంత్రాంగం పట్టించుకోదా?, వారు కనీస చర్యలు చేపట్టరా? అని భక్తులు నిలదీస్తున్నారు.



ప్రశ్నించిన భక్తులపై దాడి చేస్తున్న నిర్వాహకులు

నగరానికి చేరుకున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

విశాఖపట్నం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రెండురోజుల పర్యటన నిమిత్తం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ బుధవారంరాత్రి నగరానికి చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయంలో కలెక్టర్ ఎంఎన్‌హరేంధిరప్రసాద్, సీపీ డాక్టర్ శంఖబ్రతబాగ్చి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డీఎస్‌ప్రకాశరావుస్వాగతం పలికారు.



హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

నేడు రానున్న పలువురు న్యాయమూర్తులు

పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు గురువారం నగరానికి రానున్నారు. దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న స్నాతకోత్సవం, రాడిసన్ బ్లూలో నిర్వహించే మెడిటేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ రాడిసన్ బ్లూలో నిర్వహించే ఇంటర్నేషనల్ మెడిటేషన్ కాన్ఫరెన్స్, నోవాటెల్‌లో జరగనున్న లా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటజ్యోతిర్మయి ప్రతాప న్యాయవర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. రాడిసన్ బ్లూలో నిర్వహించే ఇంటర్నేషనల్ మెడిటేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవి చీమలపాటి హాజరుకానున్నారు. మరో హైకోర్టు న్యాయమూర్తి ఆర్.రఘునాథరావు గురువారం నగరానికి రానున్నారు.

డిజిటల్ మిషన్ లక్ష్యాలను చేరుకోవాలి: డీఎంహెచ్‌వో

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా చేపట్టిన డిజిటల్ మిషన్ లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పేర్కొన్నారు. జగదాంబ కూడలి వద్ద గల బిల్ జంక్షన్ సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ మిషన్ ఏబీ డీఎం ఆధ్వర్యంలో వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ల శిక్షణలో ఆయన మాట్లాడుతూ లక్ష్యాలకు అనుగుణంగా వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పని చేయాలని సూచించారు. స్టేట్ టెక్నికల్ కన్సల్టెంట్ కోటిరెడ్డి ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె .అప్పారావు, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ జిల్లా నోడల్ అధికారి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మేహాద్రి రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

గోపాలపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరడంతో రిజర్వాయర్ గేటు ఎత్తి 178 క్యూసెక్కుల నీటిని బుధవారం విడుదల చేశారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 61 అడు గులు కాగా గత నెల వరకూ రిజర్వాయర్ నీటిమట్టం 49 అడుగుల మాత్రమే ఉండేది. ఇటీవల కురిసిన వర్షాలతో బుధవారం మధ్యాహ్నానికి 60.2 అడుగులకు చేరింది. దీంతో ఒక గేటును మూడు అంగుళాల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నా రు. రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టి, నీటిమట్టం 60 అడుగులకు చేరే వరకూ నీటి విడుదల కొనసాగుతుందనిసిబ్బంది తెలిపారు. నీటిపారుదల శాఖ డీఈఈ జె.స్వామినాయుడు, ఏఈఈ పి.నళిని, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఎస్.సుబ్బరాజు రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఇన్‌ఫ్లో కొనసాగుతున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఈఈ సిబ్బందికి సూచించారు.



రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసిన దృశ్యం

మెడికవర్‌లో చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలు

- రాష్ట్రీయ బాల స్వాస్థ్యలో భాగంగా ఉచితంగా నిర్వహణ
- కార్డియాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ కరుణాకర్ పాడి



వివరాలు వెల్లడిస్తున్న కార్డియాలజీ నిపుణుడు డా.కరుణాకర్‌పాడి, వైద్యులు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల స్వాస్థ్య పథకంలో భాగంగా మెడికవర్ ఆస్పత్రిలో ఉచితంగా చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు నిర్వహించనున్నామని, రాష్ట్ర ప్రభుత్వం తమ ఆస్పత్రిని ఎంపిక చేసిందని మెడికవర్ ఆస్పత్రి కార్డియాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ కరుణాకర్‌పాడి తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. గుండె జబ్బులకు సకాలంలో సరైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం ఈ అవకాశాన్ని మెడికవర్ ఆస్పత్రికి కల్పించిందన్నారు. వివిధ కారణాలతో గుండెజబ్బులతో పుట్టే చిన్నారులకు ఖర్చు లేకుండా శస్త్రచికిత్సలు నిర్వహిస్తామన్నారు. కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ అశోక్‌రాజు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని చిన్నారులకు మేలు చేసేందుకు తమ ఆస్పత్రికి అవకాశం లభించిందన్నారు. ఇప్పటివరకు వివిధ పథకాలు, ఎమ్మెల్యేల లెటర్ల సాయంతో 110 మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించామన్నారు. ఆరోగ్య శాఖ అధికారులు ఆస్పత్రిని తనిఖీ చేసి, ధ్రువీకరించిన తరువాతే సర్జరీలకు అవకాశం ఇచ్చారన్నారు. సమస్యతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించేందుకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మెడికవర్ సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్‌కుమార్, వైద్యులు సుజిత్‌కుమార్ మహంతి, ఎం.విపుల్, సి.నాగసుజిత్, వై.కృష్ణ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్

నక్కవానిపాలెం బ్రాంచి, నక్కవానిపాలెం, విశాఖపట్నం, ఫోన్ : 0891-2788465

సీల్డ్ టెండర్లు మరియు వేలం
(SARFAESI చట్టం రూల్ 9(1) క్రింద నోటీసు)

SARFAESI చట్టంలోని సెక్షన్13(2) క్రింద బ్యాంక్ అధీకృత అధికారి డిమాండ్ నోటీసులను తేది 19-12-2018 న రూ. **5,32,326/-** (అక్షరములా అయిదు లక్షల ముప్పయి రెండు వేల మూడు వందల ఇరవై ఆరు రూపాయలు మాత్రమే) తేది 30-11-2018 నాటికి దర్మిలా వడ్డీ మరియు ఖర్చులతో చెల్లించవలసినదిగా 1) **శ్రీమతి టేకుముడి వరలక్ష్మి**, W/o. జమునాదాసు, 2) **శ్రీ టేకుముడి జమునాదాసు**, S/o. వెంకన్న, 3) **శ్రీమతి టేకుముడి చిన్ని**, D/o. జమునాదాసు, 4) **శ్రీ టేకుముడి చాణక్య**, S/o. జమునాదాసు, వారికి నోటీసులు ఇచ్చియున్నారు. మరియు SARFAESI చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తే 08-12-2019 దీన ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్, నక్కవానిపాలెం బ్రాంచి, విశాఖపట్నం వారికి తనఖా పెట్టిన ఈ దిగువ సుదహరించిన స్థిరాస్తిని SARFAESI చట్టం సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ స్వాధీనం చేసుకున్నారు. మరియు "ఎక్కడ వున్నది అక్కడ, ఎలా వున్నది అలాగ" వేలం వేయుటకు **ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్,నక్కవానిపాలెం బ్రాంచి, నక్కవానిపాలెం, విశాఖపట్నం**, ఫోన్ నెం. 0891-2788465 వద్ద **తేది 08-10-2025 ఉదయం 10-00 గంటలకు** సీల్డ్ టెండరు మరియు బహిరంగ వేలం ద్వారా అమ్ముటకు ఈ దిగువ సంతకం చేసిన అధీకృత అధికారి నిర్ణయించినారు.

సీల్డు టెండర్లు ఓపెన్ చేయు తేది : 08-10-2025 బుధవారం ఉదయం 10-00 గంటలకు

సీల్డు టెండర్లు మరియు వేలం వేయు స్థలం : ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, నక్కవానిపాలెం బ్రాంచి, నక్కవానిపాలెం, విశాఖపట్నం

తనఖా ఆస్తి వివరములు	బకాయి మొత్తం (రూ.) 31-08-2025 తేది నాటికి	రిజర్వు ధర రూ.	బయానా రూ. (EMD 10%)
జి.వి.యం.సి., విశాఖపట్నం, పరిధిలో పాత సర్వే నెం. 6, కొత్త సర్వే నెం. 7/3A Part గాగల విశాఖపట్నం, మద్దిలపాలెం,	9,61,437/-	40,00,000/-	4,00,000/-

కె.ఆర్.యం. కోలనీ లోని పట్టా నెం. 240, వార్డు నెం. 10, అసెస్‌మెంట్ నెం. 100003/21190, డోర్ నెం. 53-38-31/1 (డాక్యుమెంట్ ప్రకారం డోర్ నెం. 53-38-31లోని ఎ.సి.సి. షీట్ ఇల్లు) గాగల ఖాళీ స్థలం,
హద్దులు : తూర్పు : 6 అడుగుల వెడల్పు లైన్, దక్షిణం : శ్రీమతి ఎ. సుశీలమ్మ గారి ఇల్లు, పడమర : ఇతరుల ఆస్తి, ఉత్తరం : టి. జమునాదాస్ గారి మిగిలిన ఆస్తి. **మొత్తం విస్తీర్ణం : మొత్తం 200 చ॥గజములలో దక్షిణం వైపున ఉన్న 100 చ॥గజములు**

నియమ నిబంధనలు :

1. వేలంలో పాల్గొనేందుకు కాగోరు బిడ్డర్లు తిరిగి చెల్లించబడే డిపాజిట్ (EMD) ను **ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, నక్కవానిపాలెం బ్రాంచి, నక్కవానిపాలెం, విశాఖపట్నం** పేరున చెల్లించబడేలా పే-ఆర్డర్/ డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాలి. కృతార్థులైన బిడ్డర్ల విషయంలో సదరు డిపాజిట్ సర్దుబాటు చేయబడును. అధీకృత అధికారిచే వేలం అమ్మకం నిర్వహించబడును. కాగోరు బిడ్డర్లు పే-ఆర్డర్ / డిమాండ్ డ్రాఫ్ట్‌తో సహా బిడ్‌ను సీల్డ్ కవర్‌లో ఉంచి తేది 07-10-2025 సాయంత్రం 6-00 గంటలలోగా పైన తెలిపిన బ్రాంచి నందు దాఖలు చేయాలి.
2. బయానా కోసం పే-ఆర్డర్/ డి.డి. లేకుండా దాఖలు చేసిన బిడ్ ఖచ్చితంగా తిరస్కరించబడును.
3. ఎట్టి కారణాలు తెలియజేయకుండా ఏదైనా లేదా అన్ని బిడ్లను / ఆఫర్లను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు లేదా వేలం అమ్మకమును వాయిదా వేయుటకు / పోస్ట్‌పోన్ చేయుటకు, / రద్దు చేయుటకు అధీకృత అధికారికి హక్కు కలదు. బిడ్లు తిరస్కరించబడితే, ప్రైవేటు ఒప్పందం ద్వారా ఆస్తుల అమ్మకం కోసం ఏ టెండర్ల దారులతోనైనా లేదా కాగోరు బిడ్డర్లతో నైనా లేదా ఇతర పార్టీలతోనైనా అధీకృత అధికారి సంప్రదింపులు జరిపి ఆస్తిని అమ్మకము చేయవచ్చును.
4. అత్యధిక బిడ్డరుకు ఆస్తిని విక్రయించబడును.
5. పైన పేర్కొన్న ఆస్తిని తెలియజేసిన రిజర్వు ధర కంటే తక్కువగా విక్రయించబడదు.
6. బిడ్/ ఆఫరు అధీకృత అధికారిచే అంగీకరించబడితే, బిడ్‌లో అత్యధిక అమ్మకం ధర ఆఫర్ చేసిన కృతార్థుడైన బిడ్డరు అమ్మకం ధరలో బిడ్ మొత్తం (బయానాతో సహా) లో 25% మొత్తమును వెంటనే అదే రోజున అధీకృత అధికారికి చెల్లించాలి. ఆ విధంగా చేయడంలో విఫలమైతే, బయానా మొత్తం తిరిగి చెల్లించబడదు. మరియు ఆస్తి తిరిగి విక్రయించబడును.
7. కృతార్థుడైన బిడ్డరు అమ్మకం నిర్ధారించబడిన 15వ రోజులోగా లేదా అంతకంటే ముందుగా బిడ్ మొత్తంలో మిగిలిన 75% మొత్తమును పే-ఆర్డర్/ డి.డి/ క్యాష్ రూపములో **ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, నక్కవానిపాలెం బ్రాంచి, నక్కవానిపాలెం, విశాఖపట్నం** లో చెల్లించవచ్చును. బిడ్ మొత్తంలోని మిగిలిన 75% మొత్తం నిర్ణీత గడువులోగా అనగా అమ్మకం నిర్ధారించబడిన తేది నుండి 15 రోజులలోగా చెల్లింపు జరపకపోతే డిపాజిట్ మొత్తం (బయానాతో సహా బిడ్ మొత్తంలో 25%) తిరిగి చెల్లించబడదు. మరియు ఆస్తి తిరిగి విక్రయించబడును. మరియు డిఫాల్ట్ అయిన కొనుగోలుదారు తదుపరి విక్రయించబడే ఆస్తి లేదా అందులోని ఏ బాగం పైన నైనా అన్ని క్లెయిమ్‌లు కోల్పోతారు.
8. బ్యాంక్‌చే అమ్మకం నిర్ధారించబడిన మీదట మరియు చెల్లింపు నిబంధనలు పాటించినట్లయితే, అమ్మకం అధికారాలు వినియోగించుకునే అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ చట్టం 2002 క్రింద గల నియమాల ప్రకారం కొనుగోలుదారుని పేరున అమ్మకపు సర్టిఫికెట్ జారీ చేస్తారు.
9. ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ ఆ విధంగానే మరియు ఉన్నవి ఉన్నట్లుగానే" స్థితిలో మరియు సెక్యూరిటైజేషన్ చట్టం 2002లో నిర్దేశించిన నిబంధనలకు లోబడి విక్రయించబడును.
10. ఆసక్తిగల పార్టీలు/ బిడ్డర్లు వేలం అమ్మకం కోసం ఉంచబడిన ఆస్తిని బ్రాంచి పనిచేయబడిన సమయంలో బ్రాంచి మేనేజర్ అనుమతితో తనిఖీ చేసుకోవచ్చును. వాటి కోసం వారు బ్రాంచి మేనేజర్ **ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, నక్కవానిపాలెం బ్రాంచి, నక్కవానిపాలెం, విశాఖపట్నం** వారిని సంప్రదించవచ్చును.
11. కృతార్థుడైన బిడ్డరు వర్తించు విధంగా / చెల్లించతగు కన్వేయన్స్, రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ, పన్నులు, చట్టబద్ధమైన బకాయిలు మొ॥ చెల్లించబడు అన్ని ఛార్జీలను ప్రత్యేకంగా బిడ్డరు భరించవలెను.
12. బ్యాంక్ నిర్ధారణకు లోబడి అమ్మకం/ వేలం ఉంటుంది.
13. వేలం వేయబడిన ఆస్తికి సంబంధించి ఏదైనా ఛార్జ్, లీన్, తాకట్టు, రుణభారాలు, ఆస్తిపన్ను లేదా ప్రభుత్వానికి లేదా ఏ సంస్థకైనా ఏమైనా ఇతర బకాయిలు ఉంటే అధీకృత అధికారి బాధ్యత వహించరు.
14. వారి బకాయిలు పూర్తిగా తిరిగి చెల్లించనట్లయితే, పైన తెలిపిన తేదీన వేలం అమ్మకం నిర్వహిస్తూ పైన పేర్కొన్న రుణంనకు సంబంధించిన రుణగ్రహీత / గ్యారంటారుకు ఇది నోటీసుగా కూడా ఉంటుంది.
15. వేలం ప్రక్రియ ద్వారా ఆస్తుల అమ్మకం సంపూర్ణం కాకపోతే SARFAESI చట్టంలోని నిబంధనల ప్రకారం ప్రైవేట్ ఒప్పందం ద్వారా బ్యాంక్ అమ్మకమునకు వర్తింపజేస్తుంది.
16. అధీకృత అధికారిచే తెలియజేయబడిన వివరాలు అతని పరిజ్ఞానం మేరకు మరియు రికార్డుల ప్రకారం ఉన్నాయి. ఏదైనా పొరబాటు, తప్పుడు స్టేట్‌మెంట్ లేదా వదిలివేసిన దానికి సంబంధించి అతను బాధ్యత వహించడు.
17. సెక్యూర్డ్ క్రెడిటార్స్‌కు అయిన అన్ని వ్యయాలు, ఛార్జీలు మరియు ఖర్చులతో సహా అన్ని బకాయిలు ఒకవేళ ఆస్తి అమ్మకమునకు నిర్ణయించిన తేదీలోగా ఏ సమయంలోనైనా పై పేరుగల రుణగ్రహీత / సహ రుణగ్రహీత / లీగల్ హెయిర్స్ తీర్చినట్లయితే అప్పుడు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తి విక్రయించబడదు. మరియు కాగోరు బిడ్డర్ల నుండి స్వీకరించబడే అన్ని బిడ్లు ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ పక్షాన ఎటువంటి బాధ్యత / క్లెయిమ్ లేకుండా వారికి వాపసు ఇవ్వబడును.
18. ఆఫర్ ఫారంతో సహా కాగోరు బిడ్డరు ఆదాయ పన్ను శాఖచే జారీచేయబడిన PAN కార్డ్ కాపీ మరియు అతని / ఆమె గుర్తింపు రుజువు మరియు నివాస రుజువు అంటే ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్, ఎలక్షన్ కమిషన్ కార్డ్, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ మొ॥ వాటి కాపీ కూడా జతచేయాలి.

తేది : 03-09-2025, విశాఖపట్నం **అధీకృత అధికారి, నక్కవానిపాలెం బ్రాంచి**